thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

నీరజ్ చోప్రాకు ఐదో స్థానం




# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 121| జగిత్యాల | శుక్రవారం 31 జూలై, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

# తడిసి ముద్దయిన ఉత్తర తెలంగాణ



- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు
- మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం
- ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత



రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు.. అధికారులు అప్రమత్తం




వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడి ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో ఉత్తర తెలంగాణ అతలాకుతమౌతోంది. నదులు, ఉపనదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. పరిస్థితుల తీవ్రత దృష్ట్యా ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయగా.. మరో ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. భారీ వరదల నేపథ్యంలో నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు, కాళేశ్వరం వద్ద మేడిగడ్డ బ్యారేజ్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అధికారులు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంజయ్ జాజుతో పాటు సంబంధిత మంత్రులు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు హెచ్చరించారు.

– హైదరాబాద్, జూలై 30

వివరాలు 2వ పేజీలో







# విద్యారంగమే ప్రభుత్వ ప్రాధాన్యం

## 2034 వరకూ నేనే సీఎం: రేవంత్ రెడ్డి

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- విద్యా బలోపేతానికే బడ్జెట్‌లో 9 శాతం కేటాయింపు
- టీచర్ల ప్రమోషన్లు, బదిలీలపై ఆందోళన అవసరం లేదు
- ప్రతి మండలాన్ని విద్యా క్లస్టర్‌గా అభివృద్ధి చేస్తాం
- చిన్న వయసులో హాస్టళ్ల కుటుంబ బంధాలపై ప్రభావం
- 2034 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ధీమా

తెలంగాణను విద్యాపరంగా దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నామని, పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటనను ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో మంత్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.

2

- హైదరాబాద్, జూలై 30



# 16 అడుగులకే గణేశ్ విగ్రహాలు

- రవాణా సమయంలో భద్రతా నిబంధనలు పాటించాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

2

# అంగన్‌వాడీలు మరింత బలోపేతం

- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క

2





# యాపిల్ లోడ్ డీసీఎం బోల్తా

- డ్రైవర్‌ను వదిలేసి పండ్ల కోసం పరుగులు
- మహబూబాబాద్‌లో మానవత్వాన్ని మరిచిన జనం
- వైరల్‌గా మారిన ఘటన

వివరాలు 3లో..



# ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

- అనవసర అపోహాలకు గురి కావద్దు
- ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

రాష్ట్రంలో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా డిజిటలైజేషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

2



## సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ మారాలి

- ప్రధాని పదవికి రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే ఆందోళన
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక

4

## సోషల్ మీడియాలో ప్రధాని మోదీ రాజీనామా లేఖ




- ఫేక్ లేఖగా గుర్తించిన కేంద్ర సంస్థ పీఐబీ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

4

## మందుగుండు సామాగ్రి వివరాలు భద్రపరచండి

- సుప్రీంలో పెల్లెట్ గన్స్ వినియోగంపై విచారణ

జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్స్ వినియోగంపై వివాదం నడుస్తోంది. దీనిపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.



4



# ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

## ప్రజలు అనవసర అపోహాలకు గురి కావద్దు

## ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, జూలై 30:** రాష్ట్రంలో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో నాలుగు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ పక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76శాతం డిజిటలైజేషన్ పక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హుజూర్‌నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోధ్ నియోజక వర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సిఇఓ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం లిం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ పక్రియపై సంబంధిత డిఇఓలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ పక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్‌లోడ్ చేసేలా బిఎల్ఓలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఓ, ఎఇఆర్ఓలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఇఓ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రాష్నలైజేషన్ పక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లుమరిన వారి వివరాలు, అందుబాటులో లేని వారి జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్ఎల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇఆర్ఓ, ఎఇఆర్ఓ, బిఎల్ఓ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాఫ్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. దాంతోపాటు విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు.

# 16 అడుగులకే గణేశ్ విగ్రహాలు..

## రవాణా సమయంలో భద్రతా నిబంధనలు పాటించాలి

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

**హైదరాబాద్, జూలై 30:** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గణేశ్ విగ్రహాల తయారీదారులకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. గణేశ్ విగ్రహాల గరిష్ఠ ఎత్తును 16 అడుగులకు పరిమితం చేయాలని స్పష్టం చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా జరిగేలా తయారీ దశ నుంచే అన్ని భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో విగ్రహాల తయారీదారులతో మాట్లాడిన సీపీ.. గత గీడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సుమారు 23 వేల గణేశ్ విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు తెలిపారు. విగ్రహాల రవాణా సమయంలో నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేస్తూ, ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మట్టి గణేశ్ విగ్రహాల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని, చిన్న విగ్రహాల ప్రతిష్ఠాపనపై భక్తుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. తయారీ కేంద్రాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, సురక్షిత విద్యుత్ వైరింగ్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. దూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు గీర్వాటు చేయాలని, రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల తరలింపును నివారించాలని ఆదేశించారు. రవాణాకు ముందు ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలను ముందుగానే పోలీసులకు అందజేయాలని సూచించారు. భారీ విగ్రహాల రవాణా సమయంలో విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీపీ పేర్కొన్నారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు వినియోగించే క్రేన్లు, వాహనాలు ధృవీకరణ పొందినవే ఉపయోగించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

# నందిపంప్ హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

**పెద్దపల్లి, జూలై 30:** కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధ లింక్-2 ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచి ఇక్కడి పంపు హౌస్ నుంచి నీటి ఎత్తిపోతల పక్రియ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. గురువారం కూడా నీటి ఎత్తిపోతలు కొనసాగాయి. 1,4,5,6 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసి నంది రిజర్వాయర్ లోకి ఎత్తిపోస్తున్నారు. అనంతరం అదే పరిమాణంలో నంది రిజర్వాయర్ క్రష్ గేట్ల ద్వారా జలాలు గీడో ప్యాకేజీ జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ లోకి వెళుతుంది. ఆ పంప్ హౌస్ లోని నాలుగు బహుబలి మోటార్లను ఆన్ చేసి అక్కడ నుంచి వరద కాలువ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి నీటిని తరలిస్తున్నారు

# తడిసి ముద్దయిన ఉత్తర తెలంగాణ

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు
- మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం
- ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత
- రెడ్, ఆరెంజ్ అలర్ట్లు.. అధికారులు అప్రమత్తం





**హైదరాబాద్, జూలై 30:** వాయువ్య బంగాళాఖాతంలో గీర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తుండగా, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కీలక జలాశయాలకు భారీగా వరదనీరు చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రానున్న రెండు నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగింది. ప్రస్తుతం 12,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరుకుంది. కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు 77,442 క్యూసెక్కుల వరదనీరు చేరడంతో అధికారులు ఆరు గేట్లు ఎత్తి 67 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రవాహ ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌కు భారీగా వరద చేరడంతో మొత్తం 85 గేట్లను ఎత్తి 1,01,530 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ సూచించింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో నర్సాపూర్, శాంతాపూర్ వాగులు ఉప్పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు మత్తడి పారుతుండగా ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉధృతంగా ప్రవహించడంతో అటవీశాఖ అధికారులు పర్యాటకుల సందర్శనను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా జలపాతం పరిసర ప్రాంతాలకు వెళ్లొద్దని హెచ్చరించారు.

### రెడ్, ఆరెంజ్ అలర్ట్లు

తీవ్ర వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు తదితర జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

### ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించి, రోడ్లు, వంతెనలు, కల్వర్టుల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు గీర్వాటు చేయాలని, గోదావరి పరివాహక ప్రాంతాలు, జలపాతాలు, పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా గీర్వాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

### సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సూచనలు

భారీ వర్షాల నేపథ్యంలో నగరంలోని సంస్థలు సాధ్యమైనంత వరకు వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని, ఉద్యోగులకు విడతల వారీగా ముందస్తు లాగౌట్ ఇవ్వాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ప్రజలు అత్యవసరం అయితేనే బయటకు రావాలని, వర్షాల సమయంలో జాగ్రత్తగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యారంగమే ప్రభుత్వ ప్రాధాన్యం

## 2034 వరకూ నేనే సీఎం: రేవంత్ రెడ్డి

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- విద్యా బలోపేతానికే బడ్జెట్‌లో 9 శాతం కేటాయింపు
- టీచర్ల ప్రమోషన్లు, బదిలీలపై ఆందోళన అవసరం లేదు
- ప్రతి మండలాన్ని విద్యా క్లస్టర్‌గా అభివృద్ధి చేస్తాం
- చిన్న వయసులో హాస్టళ్ల కుటుంబ బంధాలపై ప్రభావం
- 2034 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ధీమా




**హైదరాబాద్, జూలై 30:** తెలంగాణను విద్యారంగంలో దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు గీమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ 9 శాతం నిధులు కేటాయిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఓట్ల రాజకీయాల కోసం కాకుండా పిల్లల భవిష్యత్తు కోసం విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని చెప్పారు. గత ప్రభుత్వాలు ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తే, తమ ప్రభుత్వం విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి పెట్టిందన్నారు. ప్రస్తుతం లక్షలాది మంది ఇంజినీరింగ్ పట్టభద్రులు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి పరిస్థితి రాకుండా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. చిన్న వయసులోనే పిల్లలను హాస్టళ్లలో ఉంచడం వల్ల కుటుంబ బంధాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి మండలాన్ని ఒక విద్యా క్లస్టర్‌గా అభివృద్ధి చేసి స్థానికంగానే నాణ్యమైన విద్య అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు తీసుకురావడానికి ప్రతి గీడాది ఎంపిక చేసిన 10 నుంచి 12 మంది ఉపాధ్యాయులను విదేశాలకు 'స్టడీ లీవ్'పై పంపనున్నట్లు సీఎం ప్రకటించారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలపై ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని, ఆ బాధ్యతను తానే స్వయంగా పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారు. 2024 జనవరి నుంచి ప్రతి నెల ఒకటో తేదీకే జీతాలు చెల్లిస్తున్నామని, హాస్టళ్లలో డైట్, ఇతర అలవెన్సులను కూడా పెంచినట్లు గుర్తుచేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా అత్యున్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. "ప్రభుత్వ పాఠశాలలో చదివితే తెలంగాణ ముఖ్యమంత్రి అవుతాను" అనే ఆత్మవిశ్వాసం ప్రతి విద్యార్థిలో ఉండాలని పిలుపునిచ్చారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకుండానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. రాజకీయ అంశాలపై స్పందిస్తూ 2034 వరకు తానే తెలంగాణ ముఖ్యమంత్రిగా కొనసాగుతానని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. ప్రతిపక్షాలు తన రాజీనామా కోరుతున్నాయని ప్రస్తావిస్తూ, విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్నాక్స్ అందించినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. విద్యావ్యవస్థ బలోపేతం కావడంలో తమ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని, రాష్ట్ర విద్యారంగ ర్యాంకింగ్ కూడా మెరుగుపడిందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనపై కూడా సీఎం విమర్శలు గుప్పించారు. 2014 తర్వాత కేంద్ర ప్రభుత్వ అప్పులు గణనీయంగా పెరిగాయని ఆరోపించారు. విమర్శలను పట్టించుకుంటూ ఉంటే అభివృద్ధి సాధ్యం కాదని, ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

- టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూలై 30:** అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక పక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు గీర్వాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

- సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
- ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
- నిపుణుల కమిటీతో రేవంత్ రెడ్డి
- ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ



**హైదరాబాద్, జూలై 30:** రాష్ట్రంలో కూరగాయల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుని రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల సెంట్రలైజ్డ్ కిచెన్ల పరిసర ప్రాంతాల్లో కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులు పండించిన పంటలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో గురువారం ఎల్‌నినో ప్రభావంపై నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను స్వీకరించిన సీఎం, ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా గ్రామస్థాయిలో సాంకేతిక సలహాలు అందించాలని ఆదేశించారు.

### ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది. ఈ పంటలకు అవసరమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై అందించాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు కొత్త రుణాలు మంజూరు చేయాలని సూచించింది. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మసేద్య పద్ధతులకు 75 నుంచి 90 శాతం వరకు సబ్సిడీ ఇవ్వాలని, పశుగ్రాస పంటల సాగును ప్రోత్సహించడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని కమిటీ నివేదికలో పేర్కొంది.

### వ్యవసాయానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక రంగాల రక్షణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను కమిటీ రూపొందించింది. గ్రామాల వారీగా అత్యవసర ప్రణాళికలు అమలు చేయడం, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్, ఫార్మ్‌పాండ్లు, చెక్‌డ్యాంల నిర్మాణం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కూరగాయల సాగును ప్రోత్సహించి రైతు బజార్లకు రవాణా సౌకర్యాలు కల్పించాలని, గ్రామీణ ప్రాంతాల్లో డెయిరీ యూనిట్ల గీర్పాటుకు ఆర్థిక సహాయం అందించాలని నివేదిక పేర్కొంది.

### రూ.803 కోట్ల కార్యాచరణ ప్రణాళిక

నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలుకు సుమారు రూ. 802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణ, పశుగ్రాస భద్రత, రైతులకు సాంకేతిక సూచనలు, గ్రామస్థాయి పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా వ్యవసాయ రంగాన్ని స్థిరంగా నిలబెట్టవచ్చని వివరించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలకు ఊరటనిచ్చాయని, అందుబాటులో ఉన్న తేమను సమర్థంగా వినియోగించుకునేలా రైతులకు మార్గదర్శకాలు అందిస్తామని చిన్నారెడ్డి తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేలా ఉద్యాన పంటలు, సేంద్రియ సాగు, సూక్ష్మసేద్య పద్ధతులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కమిటీ సిఫార్సు చేసింది.



# యాపిల్ లోడ్ డీసీఎం బోల్తా

### డ్రైవర్‌ను వదిలేసి పండ్ల కోసం పరుగులు

### మహబూబాబాద్‌లో మానవత్వాన్ని మరిచిన జనం..

**మహబూబాబాద్, జూలై 30:** మహబూబాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం మానవత్వంపై ప్రశ్నలు లేవనెత్తింది. యాపిల్ పండ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ బోల్తా పడటంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడినా, అతడిని రక్షించాల్సింది పోయి అక్కడికి చేరుకున్న పలువురు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన యాపిల్ పండ్లను ఎత్తుకెళ్లేందుకు పోటీ పడడం కలకలం రేపింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం మాటేడు గ్రామ స్టేజ్ సమీపంలోని వరంగల్--ఖమ్మం జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన డీసీఎం రోడ్డుపై బోల్తా పడటంతో వాహనంలో ఉన్న యాపిల్ పండ్లు రహదారిపై చెల్లాచెదురయ్యాయి. ప్రమాదంలో డ్రైవర్ గాయపడినా, అక్కడ గుమికూడిన వారిలో చాలామంది అతడిని పట్టించుకోకుండా పండ్లను తీసుకెళ్లడానికే ఆసక్తి చూపారు. సంచులు, బస్తాలతో వచ్చిన కొందరు కిలోల కొద్దీ యాపిల్ పండ్లను తీసుకెళ్లడంతో క్షణాల్లోనే లోడ్ మొత్తం ఖాళీ అయింది. ఈ దృశ్యాలు అక్కడ ఉన్నవారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఘటన వైరల్‌గా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బాధితుడికి సహాయం చేయకుండా పండ్ల కోసం పోటీపడిన తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మానవత్వం కంటే స్వార్థానికే ప్రాధాన్యం ఇచ్చారంటూ సోషల్ మీడియాలోనూ తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం

- 100 రోజుల్లో రూ. 6,000 కోట్ల బకాయిల చెల్లింపులు
- తాజాగా మరో రూ. 2 వేల కోట్లు విడుదల చేసిన ఆర్థిక శాఖ



**హైదరాబాద్, జూలై 30:** ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. గత 100 రోజుల్లో మొత్తం రూ.6,000 కోట్ల బకాయిలను విడుదల చేసి చెల్లించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా మరో రూ.2,000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మూడు విడతల్లో ఒక్కోసారి రూ.2,000 కోట్ల చొప్పున మొత్తం రూ.6,000 కోట్లను విడుదల చేసింది. దీంతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను పూర్తిగా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ జేగీసీ నాయకులకు ఇచ్చిన హామీని 100 రోజుల్లోనే అమలు చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న సానుకూల వైఖరిని ఉద్యోగ సంఘాల నాయకులు అభినందిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ యువ ఇంజినీర్లకు సీఎం క్షమాపణ చెప్పాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ (కేటీఆర్)

### 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం..

### యువతను అవమానించారని విమర్శ



**హైదరాబాద్:** తెలంగాణ యువ ఇంజినీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. యువ ఇంజినీర్ల ప్రతిభను 'క్రిమినల్ వేస్ట్' అంటూ అవమానించారని ఆరోపిస్తూ, వెంటనే రాష్ట్ర యువతకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. తెలంగాణ యువత సామర్థ్యాన్ని కించపరిచేలా మాట్లాడే హక్కు ముఖ్యమంత్రికి లేదన్నారు. తన జీవితంలో ఎప్పుడైనా పోటీ పరీక్ష రాశారా? గీదైనా ఉద్యోగానికి ఇంటర్వ్యూకు హాజరయ్యారా? గీదైనా వృత్తిపరమైన సంస్థలో పనిచేశారా? అంటూ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గతాన్ని ప్రజలు మరచిపోలేదని, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రయాణం బ్లాక్‌మెయిల్ రాజకీయాల వరకు వెళ్లిందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పదవిని కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చిన వ్యక్తి, దేశానికి సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లను అందిస్తున్న తెలంగాణ యువతను అవమానించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ యువత ప్రతిభకు గుర్తింపు లభిస్తోందని, అలాంటి యువ ఇంజినీర్లను కించపరిచే వ్యాఖ్యలను ముఖ్యమంత్రి వెంటనే ఉపసంహరించుకుని రాష్ట్ర యువతకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.



# బోనాలకు గవర్నర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్:** సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న ఆషాఢ బోనాల (లష్కర్ బోనాలు) ఉత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. గురువారం లోక్ భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి కొండా సురేఖ, లష్కర్ బోనాల ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ప్రధాన అర్చకులు ఆహ్వాన పత్రికను గవర్నర్‌కు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ రెడ్డి తదితర అధికారులు మంత్రి వెంట పాల్గొన్నారు.

# అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీల వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా

### పోలీస్ నోటిఫికేషన్‌లో పోస్టులు పెంచాలని డిమాండ్..

### పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీల వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటికీ హామీలను అమలు చేయలేదని వారు ఆరోపించారు. తాజాగా విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో 7,437 పోస్టులు కాకుండా 19,000 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా నిరసనలో పాల్గొన్న వారు ఎస్సై, కానిస్టేబుల్ నియామకాలలో వయోపరిమితిని సడలించాలని కోరారు. అదేవిధంగా మెగా డీఎస్సీతో పాటు గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 తదితర ఖాళీ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన కొనసాగుతున్న సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని వ్యాన్లలో సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ ఘటనతో అశోక్‌నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



# ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

### అనుకూలమైన విధానాల అమలుపై దృష్టి

### ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో సంజయ్ జాజు



**హైదరాబాద్, జూలై 30:** రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం సి.ఎస్. అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. దిగుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారులతో సమన్వయం పెంపొందించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

చురకలు



## సంపాదకీయం



# ప్రతిపక్ష పాత్రలో కాంగ్రెస్ వైఫల్యం!

**నిర్మాణాత్మక రాజకీయాలకు దూరం.. అవకాశవాద వైఖరిపై విమర్శలు**

ఈ దేశ దౌర్భాగ్యం గీమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ధి పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్థలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ గీర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ మారాలి

## ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది

- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక





**పుణె, జూలై 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని పాలించడం కంటే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా బాగా పనిచేస్తారని, అందువల్ల ప్రధాని పదవికి రాజీనామా చేసి ఆ బాధ్యతను మరొకరికి అప్పగించాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం తొలిసారి మహారాష్ట్రలోని తన స్వస్థలానికి చేరుకున్న అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీలో ఆందోళనలు ముగిసిన తర్వాత వివిధ రాష్ట్రాల్లో విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ చర్యలను నిలిపివేయాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో యువత తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల ఆగ్రహం తగ్గలేదని, వారి అసంతృప్తి ఒక్క మంత్రిపైనే కాకుండా కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువత భావోద్వేగాలను బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని విమర్శించారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వేధింపులు కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. "విద్యార్థులు ఉగ్రవాదులు కాదు.. దేశ భవిష్యత్తు. వారి స్వరాన్ని అణచివేస్తే అవసరమైతే ప్రభుత్వాన్నే మార్చే స్థాయిలో ఉద్యమం చేపడతాం" అని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో జరిగిన నిరసన సందర్భంగా విద్యార్థులపై పెల్లెట్ గన్ వినియోగించారన్న ఆరోపణలపై స్పందించిన ఆయన, ఇందుకు బాధ్యులెవ్వరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. 36 రోజులపాటు ఎండవానలను లెక్కచేయకుండా పోరాడిన కార్యకర్తలు విజయాన్ని జరుపుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో సన్మానించడం సిగ్గుచేటని అభిజీత్ విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న నేపథ్యంలో అలాంటి సన్మానం ద్వారా బీజేపీ ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని ఆరోపించిన ఆయన, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల గురించి ప్రధాని ప్రకటించినప్పటికీ తొలి విచారణకే సీబీఐ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడం ప్రభుత్వ వైఖరిని బహిర్గతం చేస్తోందన్నారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, తాను సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే స్పందిస్తానని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు.

# సోషల్ మీడియాలో ప్రధాని రాజీనామా లేఖ

**ఫేక్ లేఖగా గుర్తించిన కేంద్ర సంస్థ పీఐబీ**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**




**న్యూఢిల్లీ, జూలై 30:** ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ గిదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా పీఐబీ సూచించింది. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రాలు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరుగుతుంది' అని తెలిపింది. వైరల్ పోస్టులను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమానాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. కృత్రిమ మేధ ఆధారిత నకిలీ కంటెంట్, ఫోర్జరీ పత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో గీ సమాచారాన్నైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించాకే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు.

# విధి నిర్వహణలో భయానికి తావు లేదు

**నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి**

**సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర**



**న్యూఢిల్లీ, జూలై 30:** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్‌గీఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. గీదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్‌గీఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, గీదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

# చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

**చైనా తీరుపై ట్రంప్ అసహనం**



**వాషింగ్టన్, జూలై 30:** అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్గ÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

# మందుగుండు సామాగ్రి వివరాలు భద్రపరచండి

**సుప్రీంలో పెల్లెట్ గన్స్ వినియోగంపై విచారణ**



**న్యూఢిల్లీ, జూలై 30:** జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్స్ వినియోగంపై వివాదం నడుస్తోంది. దీనిపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జనసమూహాన్ని నియంత్రించే సమయంలో పోలీసుల బలప్రయోగం ఎలా ఉండాలనే అంశంపై అమలులో ఉన్న గ్రేడెడ్ యూజ్ ఆఫ్ ఫోర్స్ స్టాండింగ్ ఆర్డర్‌ను కోర్టు ముందు సమర్పించాలని ఆదేశించింది. వాడటానికి స్పష్టమైన రూల్స్ ఉండాలని జస్టిస్ బాగ్చీ వ్యాఖ్యానించారు. అదే సమయంలో పెల్లెట్ గన్స్‌నూ పూర్తిగా నిషేధించలేమని చెప్పింది. మరోవైపు పిటిసనర్ల తరుపుణ న్యాయవాది వాదిస్తూ.. ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాల్లో నిరసనల సమయంలో మెటాలిక్ పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ అలాంటి ఆయుధాలు వాడకంపై పోలీసుల చర్యలపై విచారణ కోరారు. ఈ వాదనల్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, క్రౌడ్ కంట్రోల్‌లో బలప్రయోగానికి సంబంధించిన అధికారికి స్టాండింగ్ ఆర్డర్‌ను రికార్డ్‌లో ఉంచాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడే అధికారం పోలీసులకు ఉందని చెప్పింది. ఇదే సమయంలో పోలీసులు వాడిన మందుగుండు సామాగ్రికి సంబంధించిన వివరాలు భద్రపరచాలని ఆదేశించింది. పెల్లెట్ గన్స్ కాల్పుల్లో గాయపడిన వారికి పూర్తి న్యాయ సహాయం అందించాలని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌ను ఆదేశించింది. ఈ కేసు విచారణలో ఢిల్లీ పోలీసులు సమర్పించే స్టాండింగ్ ఆర్డర్, పెల్లెట్ గన్ వినియోగంపై కోర్టు చేపట్టే పరిశీలన కీలకంగా మారే అవకాశం ఉంది.

చురకలు

శుక్రవారం 31.07.2026

# రేషన్ ఈ కేవైసీ గడువును వెంటనే పొడిగించాలి

- తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రేగుంట కేశవ్ రావు



**ఆసిఫాబాద్ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఈ-కేవైసీ నమోదుకు ఈ నెల 31వ తేదీని చివరి గడువుగా నిర్ణయించడం వల్ల నిరుపేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ గడువును వెంటనే పొడిగించాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రేగుంట కేశవ్ రావు మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పేద విద్యార్థిని విద్యార్థులు ప్రస్తుతం పాఠశాలలు, హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్నందున వారు స్వగ్రామాల్లో అందుబాటులో లేకపోవడం వల్ల ఈ-కేవైసీ ప్రక్రియ ఆలస్యమవుతోందన్నారు. అలాగే ఐదు, ఆరు సంవత్సరాల లోపు బాలబాలికలకు ఈ- పాస్ మిషన్లలో వేలిముద్రలు పడక పోవడం వల్ల ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. దీనికితోడు గత నాలుగైదు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో రవాణా వ్యవస్థ నిలిచిపోయి, చాలామంది రేషన్ షాపులకు వచ్చి ఈ-కేవైసీ చేసుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఈ ప్రతికూల పరిస్థితులన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ప్రకటించిన గడువు నిరుపేదలకు ఏంతమాత్రం సరిపోదని అభిప్రాయ పడ్డారు. కావున రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందించి, రేషన్ ఈ కేవైసీ నమోదు గడువును వెంటనే పొడిగించి పేద లబ్ధిదారులందరికీ తగిన అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# పశువుల సంరక్షణ పట్ల రైతులు దృష్టి పెట్టాలి



**నేరడిగొండ:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని రైతులు తమ పశువుల సంరక్షణ పట్ల దృష్టి పెట్టాలని నేరడిగొండ మండల పశు వైద్యాధికారి జీవన్ రాథోడ్ సూచించారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. కడెం, వాంకిడి వాగులు పొంగి పొర్లుతుండటంతో పరివాహక ప్రాంతాల్లో తమ పశువులను ఎట్టి పరిస్థితుల్లో మేతకు బయటకు వదలకుండా కొట్టంలోనే మేత వేయాలని కోరారు. విద్యుత్ స్తంభాలకు దగ్గరగా పశువులను కట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని పశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలని కోరారు.

# భారీ వర్షా ల నేపథ్యంలో కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. వర్షాలు, వరదలకు సంబంధించిన అత్యవసర పరిస్థితులు, సహాయం అవసరమైన సందర్భాల్లో ప్రజలు టోల్ ఫ్రీ నం.1800 425 1939ను సంప్రదించాలని సూచించారు. కంట్రోల్ రూమ్లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపడతారని తెలిపారు. ప్రజలు అనవసర ప్రయాణాలు చేయకుండా, వాగులు, లోతట్టు ప్రాంతాలు, వరద ప్రవాహాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

# భారీ వర్షా లకు ఇళ్లల్లోకి వరద నీరు



**తిర్యాణి:** మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, ఉన్న కాల్వలను శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోయి వర్షపు నీరు సరిగా వెళ్లక నేరుగా ఇళ్లలోకి ప్రవేశిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద నీటితో ఇళ్లలోని నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు దెబ్బతిని పలు కుటుంబాలు నష్టపోయినట్లు తెలిపారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతినిధి గానీ తమ ప్రాంతానికి వచ్చి పరిస్థితిని పరిశీలించలేదని, కనీసం బాధితులను పరామర్శించలేదని స్థానికులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు ప్రస్తుతం కనిపించడం లేదని, తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు ఇళ్లలోకి చేరుతున్న వరద నీటిని తొలగించి బాధితులకు తక్షణ సహాయం అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జిల్లా స్థాయిలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




**ఆసిఫాబాద్ :** భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాల అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి డి.జి.పి. సి.వి.ఆనంద్, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి.లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వర్ష పరిస్థితులు, రక్షణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్ష పరిస్థితుల నేపథ్యంలో జిల్లా స్థాయిలో 24×7 పని చేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్), జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోని వరద ప్రభావిత ప్రాంతాలలో మోహరించి అప్రమత్తంగా ఉంచామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా సమాచార వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, కూలిపోయే ప్రమాదం ఉన్న పాత భవనాలను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ జలాశయాలు, వాగులు, చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా ర్యాపిడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. పోలీసు శాఖ సమన్వయంతో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ జీరో క్యాజువాలిటీస్ లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. రాష్ట్ర డి.జి.పి. మాట్లాడుతూ అవసరమైన చోట ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా పోలీసు అధికారులు తప్పనిసరిగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను అనుసరించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించామని, జిల్లా స్థాయిలో పోలీసు శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పని చేసి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు కృషి చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం అత్యవసర సేవల నిమిత్తం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టులలో నీటిమట్టాన్ని ఇప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన రక్షణ చర్యలు చేపడుతున్నామని, లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు, శిథిలావస్థలో ఉన్న భవనాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస సంకల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణీలను గుర్తించి సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వాగులు, నదులు, కల్వర్టుల వద్ద సంబంధిత శాఖల సమన్వయంతో బందోబస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర, జాతీయ విపత్తుల స్పందన దళాల సమన్వయంతో ప్రజారక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

- వెంటనే హై-లెవల్ వంతెన నిర్మించాలని డిమాండ్
- డీ వై ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు టికానంద్

**ఆసిఫాబాద్:** అత్యవసర పరిస్థితి ఏర్పడితే గ్రామానికి కనీసం అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి నెలకొంది. నిత్యం వందలాది మంది ప్రయాణించే రహదారిపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు" అని డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు టికానంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉదయం 8 గంటల ప్రాంతంలో తిర్యాణి మండలం ఉల్లిపిట్ట-డోర్లి వంతెన




పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తిర్యాణి నుండి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఇదే కావడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనివల్ల పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, పాఠశాలలు-కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఐదేళ్లుగా అదే నిర్లక్ష్యం..!**

ఈ సందర్భంగా టికానంద్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా వర్షాకాలం వస్తే ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు నిత్యం ఈ వంతెన పైనుంచే ప్రయాణిస్తున్నప్పటికీ, సమస్యను చూసీచూడనట్లు వదిలేయడం బాధ్యతారాహిత్యమన్నారు.సింగరేణి యాజమాన్యం, జిల్లా అధికారులు , ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి నూతన హై-లెవల్ వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉల్లిపిట్ట, డోర్లి గ్రామస్థులు సంబయ్య, శ్రీను, నవీన్, శేఖర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షంలోనూ వీడని బాధ్యత

- 108 అంబులెన్స్‌లోనే గర్భిణికి సురక్షిత ప్రసవం

**ఆసిఫాబాద్:** కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒక తల్లి, బిడ్డ ప్రాణాలను కాపాడారు. వాహనంలోనే గర్భిణికి సురక్షితంగా ప్రసవం చేసి తమ మానవత్వాన్ని, వృత్తిధర్మాన్ని చాటుకున్నారు. ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన కావాల్కర్ సోని అనే మహిళకు తెల్లవారుజామున ప్రసవ వేదనలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్స్ సిబ్బంది గ్రామానికి చేరుకుని, బాధితురాలిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు బయలుదేరారు. ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో, వర్షం పడుతుండగానే మార్గమధ్యంలో సోనికి పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. పరిస్థితి తీవ్రతను గమనించిన ఈఎమ్‌టీ ప్రవీణ్ యాదవ్, పైలట్ రమేష్ వెంటనే సమయస్ఫూర్తితో వ్యవహరించారు. అంబులెన్స్‌ను వాహనం పక్కకు నిలిపి, అందులోనే వైద్య పరికరాల సహాయంతో ఈఎమ్‌టీ ప్రవీణ్ యాదవ్ కాన్పు చేశారు. సోని మూడో కాన్పులో పండంటి పాపకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, నవజాత శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నారని ఈఎమ్‌టీ ప్రవీణ్ యాదవ్, పైలట్ రమేష్ తెలిపారు. అనంతరం ప్రసవించిన మహిళను, పాపను మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆపత్కాలంలో సమయానికి స్పందించి, సురక్షితంగా ప్రసవం పూర్తి చేసిన 108 సిబ్బందికి



బాధితురాలి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సమగ్ర సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

**తాండూర్:** ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న, ల్యాండ్ సర్వే ఏడి శ్రీనివాస్ తెలిపారు. గురువారం గోపాల్ నగర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. సమగ్ర భూ సర్వే కార్యక్రమం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. భూముల కొలతలను ఖచ్చితంగా నమోదు చేయడంతో భవిష్యత్తులో భూ రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ సర్వే ఎంత గానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను సరిచూసుకుని, సర్వే ప్రక్రియలో భాగ స్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్ నగర్ గ్రామ సర్పంచ్ గాట్ల నర్సయ్య, ఆర్ఐ బొలిశెట్టి పద్మజ, సర్వేయర్ రామకృష్ణ, కార్యదర్శి సౌందర్య, రైతులు పాల్గొన్నారు.




# వార్డు సమస్యలు పరిష్కరించాలి



**కాగజ్నగర్:** కాగజ్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకనగర్ వార్డు నం.8లో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని వార్డ్ కౌన్సిలర్ గజ్జల లావణ్య మున్సిపల్ అధికారులను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో వార్డుకు సంబంధించిన పలు సమస్యలను మున్సిపల్ చైర్మన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. వార్డులోని డ్రైనేజీలను తక్షణమే శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వీధి దీపాలు లేని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి స్ట్రీట్ లైట్లను అమర్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వీధి కుక్కల బెడదను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పట్టణంలోని ప్రధాన రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన రాజకీయ ఫ్లెక్సీలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు.

# జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంది

- ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదు
- జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ :** ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్ష పరిస్థితులలో ప్రజా సంక్షేమ చర్యలలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని అడ ప్రాజెక్టును అధికారులతో కలిసి సందర్శించి వరద నీటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులు, వాగులు, లోతట్టు ప్రాంతాలలో వరద నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రజల రక్షణలో అప్ర మత్తంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అడ ప్రాజెక్టులోకి 37 వేల క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా, ప్రాజెక్టులోని 6 గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 27 వేల క్యూసెక్కుల నీటిని అవుట్‌ఫ్లోగా దిగువకు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అడ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 10.393 టి.ఎం.సి. కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 6.007 టి.ఎం.సి.ల నీరు 238 మీటర్ల మేర ఉందని తెలిపారు. వర్షాలు మరింతగా కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రాజెక్టు నుండి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున లోతట్టు ప్రాంతాలలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాలలోని వాగులు, కాలువలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, వరద నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలలో ప్రజలు రాకపోకలు సాగించకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి అవసరమైన పునరావాసం, ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుత వర్షాల పరిస్థితులను జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు కంట్రోల్ రూమ్ నం. 8500844365 లో అత్యవసర సహాయం కొరకు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలు లేక ఇండ్లలోకి వర్షపు నీరు



**తాండూర్:** మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలో గల 1వ వార్డులో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు ఇండ్లలోకి చేరిందని బీజేపీ కిష్టంపేట గ్రామ బూత్ అధ్యక్షులు ధర్మరాజుల రమేష్ అన్నారు. వర్షపు నీరు ఇండ్లలోకి చేరడంతో పలువురు ఇంటి యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రామడుగు లక్ష్మి ఇంటి దగ్గరి నుంచి మండే శంకరమ్మ ఇంటివరకు డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు ఇండ్లలోకి చేరినట్లు తెలిపారు. డ్రైనేజీ విషయమై గ్రామ సభలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి రాతపూర్వకంగా పిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. అయినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సకాలంలో స్పందించి డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# నిండు కుండలా మారిన కుంటాల జలపాతం

## పరవళ్లు తొక్కుతున్న ప్రకృతి సౌందర్యం



**నేరడిగొండ:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న కుండపోత వర్షాలకు ప్రకృతి పులకించిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో పర్యాటక ప్రాంతాలు జలకళను సంతరించుకున్నాయి. రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైనదిగా పేరుగాంచిన ప్రముఖ పర్యాటక కేంద్రమైన కుంటాల జలపాతం నిండుకుండలా మారి ఉరకలేస్తోంది. కొన్ని రోజుల కిందటి వరకు ఎండిపోయి వెలవెలబోయిన జలపాతం, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పూర్తి స్థాయి నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతోంది. కొండల పైనుంచి గర్జన చేస్తూ కిందకు పడుతున్న నీటి ధారలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

# ఎయిర్‌పోర్ట్ భూసేకరణ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్:** జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎయిర్‌పోర్ట్, ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి చట్టపరమైన చిక్కులు తలెత్తకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రీహ్యాబిలిటేషన్ అండ్ రిసెటిల్మెంట్ కమిషనరేట్ ఆధ్వర్యంలో భూసేకరణ విభాగ ప్రత్యేక అధికారి మనోహర్తో కలిసి నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిందని, డిసెంబర్ 31 నాటికి సంబంధిత ఏజెన్సీలకు భూమిని అప్పగించేలా రెవెన్యూ అధికారులు కార్యాచరణను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. గడువు పరిమితంగా ఉన్నందున పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అధికారుల బృందాల సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో ప్రతి దశలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి న్యాయపరమైన లోపాలు తలెత్తకుండా రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో తలెత్తే సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవడంతో పాటు వ్యవసాయేతర భూములు, నిర్మాణాల లెక్కింపు, రికార్డుల వ్యత్యాసాలపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో భారీ వర్షాల సూచన నేపథ్యంలో తహశీల్దార్లు, క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది తమ ప్రధాన కేంద్రాల్లోనే అందుబాటులో ఉండి సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ విభాగ ప్రత్యేక అధికారి మనోహర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూసేకరణ ప్రక్రియ, చట్టపరమైన నిబంధనలు, అమలు విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఏఓ వర్ణ, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షానికి కూలిన పశువుల పాక

## ఎద్దుకు గాయం



**నేరడిగొండ:** మండలంలో ఏకాదటిగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోకి కుంటాల గ్రామానికి చెందిన రాథోడ్ సచిన్ కుమార్ పశువుల పాక కూలిపోయింది. అందులో కట్టేసి ఉన్న ఎద్దుకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మండల పశు వైద్యాధికారి జీవన్ రాథోడ్ అక్కడికి చేరుకొని ఎద్దుకు వైద్య చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పశువుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- వరద ప్రాంతాలకు వెళ్లొద్దు
- జిల్లా ఎస్పీ నితికా పంత్



**కాగజ్నగర్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. గురువారం కాగజ్నగర్, దహెగాం, పెంచికల్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలు, పొంగిపొర్లుతున్న వాగులు, లో-లెవెల్ వంతెనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్లు, రోపులు వంటి రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, లో-లెవెల్ వంతెనలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని జలపాతాలకు ప్రస్తుతం అనుమతి లేదని, పర్యాటకులు, యువత వాటర్‌ఫాల్స్‌కు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల దృష్ట్యా చేపల వేట కోసం వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లవద్దని, పశువులను మేతకు తీసుకెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించవద్దని, అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు. అలాగే వరద ప్రాంతాల్లో సెల్ఫీలు, రీల్స్ కోసం వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని హెచ్చరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు. జిల్లా ప్రజలు పోలీసు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో కాగజ్నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, రూరల్ సీఐ కుమారస్వామి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్సైలు రమేష్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బోథ్ యువతకు పోలీస్ ఉద్యోగాల సువర్ణావకాశం



**బోథ్:** రాష్ట్రంలో 7,437 పోలీస్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం మెగా నోటిఫికేషన్ విడుదల చేయడంపై కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ హర్షం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, పోలీస్ ఉద్యోగాల మెగా నోటిఫికేషన్ ఇందుకు నిదర్శనమని తెలిపారు. బోథ్ నియోజకవర్గ యువత అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహించడంతో పాటు క్రీడాకారుల అభివృద్ధి కోసం తన సొంత నిధులతో లక్షల రూపాయలు ఖర్చు చేశానని అన్నారు. యువత అభివృద్ధే నియోజకవర్గం, రాష్ట్ర ప్రగతికి బలమైన పునాదిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ మెగా నోటిఫికేషన్ను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ నియామకాల్లో బోథ్ నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో యువత ఎంపికై ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# భద్రతా పక్షోత్సవంలో కిష్టారం ఓసీకి ద్వితీయ బహుమతి



**సత్తుపల్లి:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 56వ వార్షిక భద్రతా పక్షోత్సవం–2025లో సత్తుపల్లి ఏరియాకు చెందిన కిష్టారం ఓపెన్కాస్ట్ ప్రాజెక్టు గ్రూప్–3 ఓసీ గనుల విభాగంలో ఓవరాల్ పర్ఫార్మెన్స్లో ద్వితీయ బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా గురువారం కిష్టారం ఓసీ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఏఎల్ఎస్వి సునీల్ వర్మ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్తో పాటు గని మేనేజర్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్తమ పనితీరు కనబర్చి ఈ ఘనత సాధించిన ప్రతి ఉద్యోగిని అభినందించారు. భవిష్యత్తులో కూడా భద్రతా నిబంధనలను ఖచ్చితంగా అమలు చేస్తూ ప్రమాదరహిత, సురక్షితమైన పని వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. అనంతరం ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేసి విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ బి.రామకృష్ణ, అడిషనల్ మేనేజర్ వల్లమల్ల బాబు, సేఫ్టీ ఆఫీసర్ గోపి కిశోర్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ కిశోర్ కుమార్, ఐఎన్టీయూసీ పిట్ సెక్రటరీ షణ్ముఖ చారి, ఇతర అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, డీఎల్ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు దెబ్బతిన్న రేచిని రోడ్–రైల్వే స్టేషన్ మార్గం

## హైవే మార్గాన్నే వినియోగించాలని విజ్ఞప్తి



**తాండూర్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రేచిని రోడ్–రైల్వే స్టేషన్ రహదారి తీవ్రంగా దెబ్బతింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ గురువారం దెబ్బతిన్న రహదారి, తాండూర్–రైల్వే స్టేషన్ మధ్య ఉన్న వంతెనను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. మేకలవాణి చెరువు నిండడంతో మత్తడి నీరు అధికంగా ప్రవహించి రైల్వే స్టేషన్ సమీపంలోని రహదారి పూర్తిగా కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రత దృష్ట్యా తాండూర్ మండల ప్రజలు రైల్వే స్టేషన్ వెనుక వైపు ఉన్న దెబ్బతిన్న మార్గాన్ని ఉపయోగించవద్దని, ప్రత్యామ్నాయంగా హైవే రోడ్డు ద్వారానే ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు పరిస్థితిని పూర్తిగా సాధారణ స్థితికి తీసుకువచ్చే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి సహకరించాలని కోరారు. వారి వెంట బెల్లంపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంతెన శివకృష్ణ, నాయకులు కంపేల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలపై సీఎంకు కృతజ్ఞతలు



**బోథ్:** పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంపై కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది యువతకు ఈ నోటిఫికేషన్ కొత్త ఆశలు, ఆత్మవిశ్వాసాన్ని కల్పించిందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ యువత ప్రభుత్వానికి అండగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## వాగును పరిశీలించిన ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ



**జైనూర్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని జంగం గ్రామ సమీపంలోని వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జంగం ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ గురువారం వాగు వద్దకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వాగు నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. వరద నీరు పూర్తిగా తగ్గే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులను వాగులు, కాలువల సమీపానికి వెళ్లనివ్వవద్దని తెలిపారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

## వీఎం బంజర్లో కోతుల బీభత్సం

- **చిన్నారిని కాపాడబోయిన తండ్రిపై దాడి.. గ్రామస్తుల్లో భయాందోళన**



**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్ గ్రామంలో కోతుల గుంపు బీభత్సం సృష్టించింది. గ్రామానికి చెందిన మాధవ్ తన 11 నెలల చిన్నారితో ఇంటి వద్ద ఉండగా ఒక్కసారిగా కోతులు దాడి చేశాయి. చిన్నారిని రక్షించే ప్రయత్నంలో మాధవ్పై కోతులు తీవ్రంగా దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయి. గాయపడిన మాధవ్ను కుటుంబ సభ్యులు వెంటనే పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. చిన్నారి స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడినట్లు తెలిసింది. గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి కోతుల సంచారాన్ని నియంత్రించి గ్రామస్తులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## డ్రైనేజీలు పొంగి రోడ్లపై చేరిన మురుగు నీరు



**వాంకిడి:** మండలంలోని సరండి గ్రామపంచాయతీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్లపై మురుగు నీరు చేరింది. కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి పేరుకుపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక గ్రామంలోని పలు వీధులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లలోకి కూడా నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల స్పందన కోసం ఎదురుచూడకుండా గ్రామ యువకులు, పెద్దలు, స్థానికులు స్వచ్ఛందంగా రంగంలోకి దిగారు. పారలు, ఇనుపరాడ్లు, కర్రలతో డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ కవర్లు, మట్టిని తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు. గ్రామంలోని అన్ని డ్రైనేజీలను యంత్రాలతో శుభ్రం చేయాలని, రోడ్లపై నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని, శాశ్వత వరద నివారణ చర్యలు చేపట్టి కొత్త డ్రైనేజీ కాలువలు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, ఆస్తుల రక్షణ కోసం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారాలే అవసరమని స్పష్టం చేశారు.

# వర్షా ల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**



**ఆసిఫాబాద్ రూరల్:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వాగులు, వంకలు, చెరువులు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లాలోని రాజుర వద్ద ఉన్న వాగు కాజ్‌వేను సందర్శించి, నీటి ప్రవాహ పరిస్థితిని పరిశీలించి వరద నీటి ఉధృతి, రాకపోకల పరిస్థితి, ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కాజ్‌వే వద్ద వరద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు కాజ్‌వేను దాటకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని, నీటి మట్టం, ప్రవాహ ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితిని బట్టి ప్రజలకు రాకపోకలపై సూచనలు తెలిపారు. అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమ యంలో కాజ్‌వే మీదుగా రాకపోకలను నియంత్రించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు వాగులు, వంకలు, కాజ్‌వేలు, కల్వర్టులు, ఇతర నీటి ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని, వరద నీటిలో వాహనాలతో వెళ్లేందుకు ప్రయత్నించడం, నీటి ప్రవాహాన్ని అంచనా వేయకుండా కాజ్‌వేలను దాటడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచే పరిస్థితులు, రహదారులపై వరద నీటి ప్రవాహం, చెరువులు, కుంటలు, వాగుల వద్ద నీటి మట్టం పెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అత్యవసర పరిస్థితులలో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల భద్రతకు ఎటువంటి ముప్పు వాటిల్లకుండా జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని, వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- **పలు కాలనీల్లో మున్సిపల్ చైర్పర్సన్ పర్యటన**



**ఆదిలాబాద్:** భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్తో కలిసి పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బంగారిగూడ, డైట్ గ్రౌండ్, మణిపూర్ కాలనీ, దస్నాపూర్, రాంనగర్ తదితర ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యవసరమైతే తప్పా ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వరద నీటిలో ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రజలకు వెంటనే సహాయం అందించేందుకు మున్సిపల్ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సెల్:9000018842పై సంప్రదించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరం విధులు నిర్వహిస్తుండగా, జేసీబీలు, అత్యవసర స్పందన బృందాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్ సేవలను కూడా వినియోగిస్తామని వివరించారు. ఖాళీ స్థలాల యజమానులు తమ ప్లాట్లలో మట్టి, మొరం వేసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని నివారించేందుకు సహకరించాలని కోరారు. అలాగే నాలాలు, వాగులపై నిర్మించిన అక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని హెచ్చరించారు. ఆమె వెంట శానిటరీ ఎస్సైలు శంకర్, నరేందర్, నారాయణ రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవి కిరణ్, కౌన్సిలర్లు మంగేష్, దత్తు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎస్ఐఆర్ కీలకం

**బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్**



**బోథ్:** ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతో కీలకమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. గురువారం బోథ్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ శ్రేణులు, బీఎల్ఏ–2 పూర్తి సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హమ్దాన్, ఆదిలాబాద్ జిల్లా అబ్జర్వర్ అరెపల్లి మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ ఎంపీ సోయం బాపురావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్తో కలిసి ఓటర్ల జాబితా సవరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి బూత్లో ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా బీఎల్ఏ–2లు, కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, భూపెల్లి శ్రీధర్, నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ పసుల చంటి, మాజీ బ్లాక్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆశన్న, జిల్లా కార్యదర్శులు లోలపు పోశెట్టి, భీంరావు పాటిల్, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు దౌలత్ రావు, సొనాల మండల అధ్యక్షుడు గాజుల పోతన్న, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చైర్మన్ అంజయ్య, మాజీ అధికార ప్రతినిధి ఎండి సద్దాం, మాజీ ఎంపీటీసీ ఉమేష్, సూపర్వైజర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వర్షా లకు సాంగ్విలో కూలిన గోడ



**కెరమెరి:** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని సాంగ్వి గ్రామంలో ఓ ఇంటి గోడ కూలిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సాంగ్వి–కేలి బీ గ్రామాల మధ్య ఉన్న ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తోంది. వరద ఉధృతి కారణంగా మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలతో పాటు ఇందాపూర్, ఖైరి, గోందుగూడ తదితర సుమారు 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బుధవారం రాత్రి ఇంటి గోడ కూలిపోయిన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ సుజాయిత్ ఖాన్, స్థానిక సర్పంచ్ కార్వెత విమల–బాపూరావుతో కలిసి ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ఓ కాలనీలో వరద నీరు ఇండ్ల మధ్య చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎంపీడీఓ అంజత్ పాషా, తహశీల్దార్ నాగార్జున, ఎస్సై శ్రీకాంత్తో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇళ్లలోకి నీరు చేరకుండా ఆయిల్ ఇంజిన్ ద్వారా వెంటనే నీటిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం అధికారులు సాంగ్వి–కేలి బీ గ్రామాల మధ్య ఉప్పొంగి ప్రవహిస్తున్న ఒర్రెను పరిశీలించి, వరద ప్రవాహం తీవ్రంగా ఉన్నందున ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉంటాం

- **వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మంత్రి గడ్డం వివేకానంద**



**మంచిర్యాల:** ప్రస్తుతం కొనసాగుతున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, అత్యవసర పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఏసీపీ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజలింగుతో కలిసి మందమర్రి మున్సిపల్ పరిధిలోని 19, 7 వార్డుల్లో వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. కామాఖ్య అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో నీటి ప్రవాహాన్ని పరిశీలించడంతో పాటు కూలిన ఇంటి గోడను సందర్శించి బాధితులకు పరిహారం అందించి ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెన్నూర్ నియోజకవర్గంలోని వరద ప్రభావిత గ్రామాల్లో రవాణా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని సూచించారు. కోటపల్లి మండలం ఆల్గాం గ్రామంలో గోడ కూలిన ఘటనపై కూడా అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పురోగతిని సమీక్షించి, డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**సత్తుపల్లి:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలోని మంత్రి నివాసంలో గురువారం సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్లూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కల్లూరు పట్టణం, మండలానికి చెందిన మొత్తం 64 మంది లబ్ధిదారులకు రూ.21,70,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అలాగే 49 మంది లబ్ధిదారులకు రూ.49,05,684 విలువైన కళ్యాణలక్ష్మి –షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి



చేస్తున్నామని, ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, తహశీల్దార్, రెవెన్యూ అధికారులు, కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొట్రూ అర్జున్ రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉస్మాన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలోకి వరద నీరు.. చిన్నారుల భద్రతపై ఆందోళన

- తడిసిన నిత్యావసర సరుకులు
- నూతన భవనం నిర్మించాలని గ్రామస్థుల డిమాండ్

**వాంకిడి:** మండలంలోని సరండి గ్రామపంచాయతీలోని అంగన్వాడీ కేంద్రం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో దయనీయ స్థితికి చేరుకుంది. వర్షపు నీరు భవనంలోకి చేరడంతో కేంద్రం పూర్తిగా జలమయమై, చిన్నారుల విద్య, ఆటపాటలు, పోషకాహార కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంగన్వాడీలో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, నూనె, ఉప్పు, కోడి గుడ్లు, పోషకాహార పదార్థాలు, వంట, విద్యా సామగ్రి, ఆట వస్తువులు, ఫర్నిచర్ తదితర వస్తువులు వర్షపు నీటికి తడిసి పాడయ్యే పరిస్థితి నెలకొంది. వర్షపు నీటిని అంగన్వాడీ ఆయమ్మ బిందెలతో ఎత్తిపోస్తున్న దృశ్యం స్థానికులను కలచివేసింది. ఈ సందర్భంగా గ్రామ పటేల్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కొట్రాంగే మేంఘజి మాట్లాడుతూ సరండి అంగన్వాడీ



భవనం ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉందన్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని విమర్శించారు. భవనంలో నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన, దోమలు, విషపురుగుల బెడద పెరిగిందని, గోడలు బలహీనపడి ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పిల్లలకు పరిశుభ్రమైన వాతావరణంలో పోషకాహారం అందించడం కూడా కష్టంగా మారిందని పేర్కొన్నారు. అంగన్వాడీ భవనం చుట్టూ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు నేరుగా భవనంలోకి చేరుతోందని తెలిపారు. వెంటనే డ్రైనేజీ కాలువలు నిర్మించడం, తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం, దెబ్బతిన్న నిత్యావసర సరుకులను భర్తీ చేయడం, శాశ్వత పరిష్కారంగా అన్ని సౌకర్యాలతో కూడిన నూతన అంగన్వాడీ భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఐసీడీఎస్, మండల అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి నివేదిక సమర్పించి, ప్రత్యేక నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని కోరారు. చిన్నారుల భద్రత, ఆరోగ్యంతో రాజీ పడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

# వర్షా ల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- గాయపడిన బాధితులను పరామర్శించిన మంత్రి గడ్డం వివేకానంద

**మంచిర్యాల:** ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద సూచించారు. ఇంటి గోడ కూలిన ఘటనలో గాయపడి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ఆర్ఎంఓలు భీష్మ, శ్రీధర్, కోటపల్లి తహశీల్దార్ రాఘవేంద్రతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కోటపల్లి మండలం ఆలుగాం గ్రామానికి చెందిన ఆత్రం మాంతయ్య ఇంటి గోడ కూలి ఆత్రం లక్ష్మి , ఆత్రం అనిల్ గాయపడినట్లు తెలిపారు. బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్షాల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు ప్రజల రక్షణ కోసం అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా పనిచేస్తున్నారని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశామని, భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణతో ప్రజా సంరక్షణ చర్యలు



కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాద ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను నియంత్రించాలి

అదనపు కలెక్టర్ చంద్రయ్య

**మంచిర్యాల:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, నదులు, కల్వర్టులు తదితర ప్రమాద ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను కట్టడి చేస్తూ పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. గురువారం జైపూర్ మండలం టేకుమట్ల గ్రామపంచాయతీ పరిధిలోని వాగు ప్రవాహాన్ని, శిథిలావస్థలో ఉన్న మండల ప్రాథమికోన్నత పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వాగు ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు, వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగును దాటే ప్రయత్నం చేయవద్దని



సూచించారు. ప్రమాద ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, పంచాయతీ, పోలీసు సిబ్బంది సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న మండల ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించి, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ భవన స్థితిపై సమగ్ర నివేదిక రూపొందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపు, సీఐ నవీన్ కుమార్, ఎస్సై భూమేష్, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షా లు.. అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**మంచిర్యాల:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి డీజీపీ సి.వి.ఆనంద్తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో వర్ష పరిస్థితులు, చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ జిల్లాల్లో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వరద ప్రభావిత ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పాత భవనాలు, జలాశయాలు, వాగులు, చెరువుల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. డీజీపీ





సి.వి.ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించామని, అవసరమైన చోట ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా పోలీసు అధికారులు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం పనిచేస్తూ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టామని, వాగులు, నదులు, కల్వర్టుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలు వెళ్లకుండా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలను కూడా సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ సమీక్షలో డీసీపీ ఎ.భాస్కర్తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్యాస్ దళారుల దోపిడీ!

కెరమెరిలో రూ.1016 సిలిండర్ రూ.1100కు విక్రయం




**కెరమెరి:** మండలంలో గ్యాస్ సిలిండర్ల సరఫరా పేరుతో దళారుల దందా జోరుగా సాగుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1016 ఉన్న గ్యాస్ సిలిండర్ను రూ.1100 వరకు విక్రయిస్తూ సామాన్య, మధ్య తరగతి ప్రజల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులు బిల్లులో ఉన్న ధర కంటే ఎక్కువ ఎందుకు చెల్లించాలని ప్రశ్నిస్తే, "ఇంతే ఇవ్వాలి.. లేదంటే వచ్చే నెల నుంచి గ్యాస్ సిలిండర్ ఇవ్వం" అంటూ కొందరు డెలివరీ సిబ్బంది బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన, గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఈ దోపిడీ కొనసాగుతోందని స్థానికులు అంటున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో దళారులు మరింత రెచ్చిపోతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారిక ధర కంటే అధికంగా వసూలు చేస్తున్న వారిపై వెంటనే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ వసూళ్లను అరికట్టడంలో అధికారులు విఫలమైతే మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు.

## బాధిత కుటుంబానికి అండగా సర్పంచ్



**జైనూర్:** మండల కేంద్రంలో గురువారం కురిసిన భారీ వర్షంతో శివాజీనగర్కు చెందిన షేక్ మైను ఇంట్లోకి వర్షపు నీరు చేరి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎ దుర్కొన్నారు. సమాచారం అందుకున్న జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్ వర్షాన్ని లెక్కచేయకుండా కాలి నడకన బాధిత కుటుంబం ఇంటికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వెంటనే గ్రామపంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి ఇంట్లోకి చేరిన వర్షపు నీటిని తొలగించేలా చర్యలు చేపట్టారు. బాధిత కుటుంబానికి అవసరమైన తక్షణ సహాయాన్ని అందించారు. భారీ వర్షంలో తడుస్తూనే ప్రజలకు అండగా నిలిచి సేవలందించిన సర్పంచ్ సేవాభావాన్ని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ డొంగ్రే ప్రకాష్, నాయకులు అబ్బు తాలిబ్, రమేష్, భీవ, మాజీ జెడ్పీటీసీ విశ్వంబర్, మాజీ ఎంపీటీసీ రఫిక్, అబ్దుల్లా, పాన్షాప్ ఫయాజ్, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షా ల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**జైనూర్:** మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ రషీద్ సూచించారు. కొన్ని ప్రాంతాల్లో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నందున అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని తెలిపారు. వరద నీటిలో ప్రయాణాలు చేయవద్దని పేర్కొన్నారు. వాగులు, కాలువలు, వరద నీటి సమీపానికి వెళ్లకుండా చూడాలని కోరారు. బలహీనమైన ఇళ్లలో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి వారి సూచనలు పాటించాలని కోరారు.

## అసంపూర్తి సైడ్ డ్రైన్తో ప్రజల అవస్థలు



**వాంకిడి:** మండలంలో ఎన్హెచ్ఏఐ నిర్మించిన సైడ్ డ్రైన్ అసంపూర్తిగా ఉండటంతో గత రెండేళ్లుగా ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు సక్రమంగా వెళ్లక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ పూర్తికాకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాంకిడి, సరండి, బంబర, గోయగాం, మహాగాం ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ఇళ్లలోకి నీరు చేరడంతో గృహోపకరణాలు తడిసిపోగా, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నప్పటికీ ఎన్హెచ్ఏఐ అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న సైడ్ డ్రైన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి, వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు సెలవు

జిలాల కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్:** జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికలు, పలు ప్రాంతాల్లో నెలకొన్న ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, గురుకులాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఈ సెలవుకు బదులుగా ఆగస్టు 8న రెండో శనివారం విద్యాసంస్థలు సాధారణంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ మార్పును గమనించాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు, వరదల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా, సహాయం అవసరమైనా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన టోల్ఫ్రీ నం.1800 425 1939కు సమాచారం అందించాలని కోరారు.

# స్ట్రాబెర్రీలతో ఎన్నో మేళ్లు..



స్ట్రాబెర్రీలు.. ఈ పండ్లను చాలా మంది ఎంతో ఇష్టంతో తింటుంటారు. అవి చాలా రుచికరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయి. ఇటీవల స్ట్రాబెర్రీల వల్ల కలిగే అనేక ప్రయోజనాలపై నిర్వహించిన అధ్యయనంలో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఒకసారి చూద్దాం.

### గుండె ఆరోగ్యానికి మంచిది...

స్ట్రాబెర్రీలు విటమిన్ సి, ఫైబర్, పొటాషియం వంటి గుండెకు ఆరోగ్యకరమైన పోషకాలకు గొప్ప మూలం. ఈ పోషకాలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి, రక్తపోటును మెరుగుపరచడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. మీ ఆహారంలో స్ట్రాబెర్రీలను చేర్చడం ద్వారా, మీరు మీ గుండె ఆరోగ్యానికి తోడ్పడవచ్చు. గుండె సంబంధ సమస్యల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.



### పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు...

స్ట్రాబెర్రీలు యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి మీ శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి, వాపు నుండి రక్షించడంలో సహాయపడతాయి. యాంటీఆక్సిడెంట్లు గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా తినడం ద్వారా, మీరు మీ యాంటీఆక్సిడెంట్ తీసుకోవడం పెంచుకోవచ్చు. అలాగే మీ మొత్తం ఆరోగ్యాన్నిమెరుగుపరుచుకోవచ్చు.





### బరువు తగ్గడానికి సహాయపడుతుంది...

బరువు తగ్గించాలని చూస్తున్నట్లయితే, మీ బరువు తగ్గించే ప్రయాణానికి స్ట్రాబెర్రీలు గొప్పగా పనిచేస్తాయి. ఈ పండ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కానీ, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది మీకు ఎక్కువ కాలం పూర్తిగా సంతృప్తిగా ఉండటానికి సహాయపడుతుంది. అనారోగ్యకరమైన ఆహారాలకు బదులుగా స్ట్రాబెర్రీలను తినడం ద్వారా, మీరు మీ కేలరీల తీసుకోవడం తగ్గించుకోవచ్చు. అలాగే మీ బరువు తగ్గించే లక్ష్యాలకు మద్దతు ఇవ్వవచ్చు.

### రోగనిరోధక శక్తిని పెంచుతుంది...

స్ట్రాబెర్రీలు రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన విటమిన్ C తో నిండి ఉంటాయి. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా తినడం ద్వారా, మీరు మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవచ్చు. అలాగే అంటువ్యాధులు, అనారోగ్యాల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. విటమిన్ C కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కూడా సహాయపడుతుంది. ఇది ఆరోగ్యకరమైన చర్మం, గాయం నయం చేయడానికి అవసరం.

### జీర్ణక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది...

అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా, స్ట్రాబెర్రీలు ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహించడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడతాయి. ఫైబర్ ప్రేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను తినిపించడం ద్వారా పేగుల ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. మీ ఆహారంలో స్ట్రాబెర్రీలను చేర్చడం ద్వారా, మీరు మీ జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు.



# భోజనం తర్వాత నడిస్తే.. ప్రయోజనాలివే..

మీకు భోజనం చేసిన తర్వాత నడిచే అలవాటు ఉందా? లేదంటే.. ఇప్పటినుంచే తినగానే కాసేపు నడవడం అలవాటు చేసుకోండి. చాలామంది తిన్నవెంటనే చిన్నగా నిద్రపోతుంటారు. అది మీ ఆరోగ్యానికి మంచిది కాదు. ఆరోగ్యకరమైన జీర్ణక్రియ, మెరుగైన ఆరోగ్యం కోసం ప్రతి భోజనం తర్వాత కొద్దిసేపు నడవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. తిన్న తర్వాత, ఒక చిన్న నడక ద్వారా అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. తిన్న తర్వాత ఎందుకు నడవాలి? ఈ 5 కారణాలను తప్పక తెలుసుకోండి.

### మెరుగైన జీర్ణక్రియ...

తిన్న తర్వాత నడవడం ద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపు కండరాలు, ప్రేగులను ప్రేరేపించడం ద్వారా జీర్ణక్రియకు నడక సాయపడుతుంది. ఆహారం వేగంగా కదలడానికి వీలు కల్పిస్తుంది. ఇది గుండెల్లో మంట, మలబద్ధకం, ఉబ్బరం, ఆమ్లత్వం, కడుపు నొప్పి వంటి సమస్యలను నివారించడంలో కూడా సాయపడుతుంది.



### గమనించాల్సిన విషయాలు..

భోజనం, నడక మధ్య 10 నుంచి 15 నిమిషాల గ్యాప్ ఉండాలి. అలాగే, ఏదైనా అసౌకర్యంగా అనిపిస్తే నడక వేగాన్ని తగ్గించండి.

### నియంత్రిత రక్తంలో చక్కెర...

మధుమేహం ఉన్నవారికి భోజనం తర్వాత నడవడం చాలా ముఖ్యం. భోజనం తర్వాత వ్యాయామం చేయడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నిరోధించడంలో సాయపడుతుంది. అంతేకాదు..రోజంతా రక్తంలో చక్కెర స్థాయిలను మెరుగుపరుస్తుంది.

### ఆరోగ్యకరమైన బరువు...

నడక అనేది సులభమైన వ్యాయామం. కేలరీలను బర్న్ చేయడంలో సాయపడుతుంది. తొందరగా బరువు తగ్గవచ్చు. నడక మంచి మానసిక ఆరోగ్యం కూడా. అలాగే, గుండె ఆరోగ్యాన్ని సైతం పెంచుతుంది. శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుంది. మీ కండరాలు, ఎముకలను బలోపేతం చేయడం వంటి అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది.

### రక్తపోటును నియంత్రిస్తుంది...

భోజనం తర్వాత నడవడం రక్తపోటును నియంత్రించగలదని కొన్ని అధ్యయనాలు చూపిస్తున్నాయి. మీరు హైపర్‌టెన్సివ్‌గా ఉంటే.. తిన్న తర్వాత క్రమం తప్పకుండా నడవడం చాలా మంచిది. ఆరోగ్యకరమైన రక్తపోటు ఉండేలా సాయపడుతుంది.

### మంచి నిద్ర...

నడకతో మీ శరీరం రిలీఫ్ అవుతుంది. నిద్రలేమి సమస్యను నియంత్రిస్తుంది. తినడం తర్వాత జీర్ణ రుగ్మతలను తొలగిస్తుంది. మంచి నిద్రను ప్రోత్సహించడంలో సాయపడుతుంది.



# పెరిగిన పసిడి ధరలు



**బిజినెస్ డెస్క్ :**

వరుసగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు ఇవాళ ఊహించని షాక్ ఇచ్చాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో గురువారం పసిడి ధరలు పెరిగాయి. గ్లోబల్ మార్కెట్ సంకేతాలు, స్థానిక డిమాండ్ పెరగడంతో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.820 పెరిగి రూ.1,44,330 వద్దకు చేరింది. అదేవిధంగా ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.750 మేర ఎగబాకి రూ.1,32,300 వద్ద విక్రయమవుతోంది. ఇదిలా ఉంటే గత రెండు రోజులుగా వెండి ధర రూ.2,35,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని విభిన్న ప్రాంతాలను బట్టి, స్థానిక పన్నులు, రవాణా ఛార్జీల ఆధారంగా నగరాల మధ్య ఈ ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉందని వర్తకులు తెలిపారు. అయితే బులియన్ మార్కెట్‌లో ప్రకటించే ఈ ప్రాథమిక ధరలపై వినియోగదారులు కొనుగోలు చేసే సమయంలో అదనంగా 3 శాతం జీఎస్టీ (GST) తో పాటు తయారీ కూలీ (మేకింగ్ చార్జీలు) వర్తిస్తాయని బులియన్ వర్తక సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

# స్విగ్గీ నష్టం రూ.791 కోట్లు..
## ఆదాయంలో మెరుగైన వృద్ధి




**బిజినెస్ డెస్క్ :**

ప్రముఖ ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థ స్విగ్గీ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌జూన్ త్రైమాసికానికి గానూ రూ.791 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1197 కోట్ల నష్టాన్ని కంపెనీ ప్రకటించింది. అప్పటితో పోలిస్తే నష్టం కాస్త తగ్గుముఖం పట్టింది.సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 37 శాతం వృద్ధితో రూ.6,182 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.4,961 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.7023 కోట్లుగా ఉంది. మొత్తం ఖర్చులు 25 శాతం పెరిగి రూ.7813 కోట్లకు చేరినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది.స్విగ్గీకి ఫుడ్ డెలివరీ వ్యాపారం లాభాలను తెచ్చిపెడుతోంది. ఈ విభాగంలో 48 శాతం వృద్ధితో రూ.299 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. ఆదాయం 23 శాతం వృద్ధితో రూ.2,208 కోట్లుగా ఉంది. ఇన్‌స్టామార్ట్ రూ.651 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. ఆదాయం మాత్రం 53 శాతం వృద్ధితో రూ.1232 కోట్లకు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో ఇన్‌స్టామార్ట్ డార్క్ స్టోర్ల సంఖ్య మరో 28 పెరిగాయి. మొత్తం స్టోర్ల సంఖ్య 1,171కు చేరింది.

# రూ.2 లక్షల కోట్ల దివీస్

**బిజినెస్ డెస్క్ :**

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఔషధ సంస్థ దివీస్ లేబొరేటరీస్, మార్కెట్ విలువ పరంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశంలో సన్ ఫార్మా తర్వాత రూ.2 లక్షల కోట్ల మార్కెట్ విలువ మైలురాయిని అధిగమించిన రెండో కంపెనీగా నిలిచింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి, ఈ ఘనత సాధించిన ఔషధ సంస్థ దివీస్ మాత్రమే. 2010లో రూ.8,000 కోట్లుగా ఉన్న దివీస్ మార్కెట్ విలువ, 2020లో రూ.లక్ష కోట్లకు చేరింది. ఆ తర్వాత తన సామర్థ్యాన్ని పెంచుకుంటూ.. ఆరేళ్లలోనే రూ.2.07 లక్షల కోట్ల స్థాయికి చేరింది. బుధవారం (జులై 29) మదుపరుల కొనుగోళ్ల జోరుతో దివీస్ ల్యాబ్స్ షేరు ఎన్ఎస్ఈలో రూ.7,818.50 గరిష్ఠానికి చేరింది. మార్కెట్ ముగిసే సమయానికి రూ.7814.50 వద్ద స్థిరపడింది. ఒక్క రోజే ఈ షేరు 5.25% పెరిగింది. ఈనెల 1న షేరు విలువ రూ.6,542 కాగా, ఇప్పటికే రూ.1,276 పెరిగింది. అంతర్జాతీయ ఫార్మా కంపెనీలకు అవసరమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ) సరఫరాలో దివీస్ తొలి స్థానంలో ఉంది. నొప్పుల నివారణ, దగ్గు మందు తదితర కీలక ఔషధాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది.అప్పుల్లేని కంపెనీగా దివీస్ కొనసాగుతోంది. కాకినాడ ప్రాజెక్టు సహా దాదాపు రూ.2,500 కోట్ల మూలధన వ్యయం ప్రణాళికలను సొంత నిధులతోనే చేపడుతుండటం మదుపరుల్లో నమ్మకాన్ని పెంచింది.జీడిమెట్ల, చౌటుప్పల్, విశాఖ తయారీ కేంద్రాల ఉత్పత్తుల్లో 8590% అమెరికా, ఐరోపా దేశాలకే ఎగుమతి అవుతున్నాయి.డాక్టర్ మురళి దివీ సారథ్యంలోని ఈ కంపెనీ హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మార్చడంలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తోంది.

# ఫార్మసీ రంగంలోకి డీమార్ట్ గ్రాండ్ ఎంట్రీ...

**బిజినెస్ డెస్క్ :**




నిత్యావసర వస్తువుల వ్యాపారంలో తక్కువ ధరల వ్యూహంతో సంచలనం సృష్టించిన డీమార్ట్, ఇప్పుడు మరో కొత్త రంగాన్ని కుదిపేసేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు కిరాణా, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌కే పరిమితమైన డీమార్ట్.. తాజాగా ఫార్మసీ రిటైల్ రంగంలోకి అధికారికంగా అడుగుపెట్టింది. తన పూర్తి యాజమాన్య అనుబంధ సంస్థ రిఫ్లెక్ట్ హెల్త్‌కేర్ అండ్ రిటైల్ ద్వారా డీమార్ట్ ఈ కొత్త వెంచర్‌ను ప్రారంభించింది. ఎలాంటి ప్రచార ఆర్భాటాలు, ప్రకటనలు లేకుండా ముంబైలోని ఎంపిక చేసిన డీమార్ట్ స్టోర్లలో షాప్‌ఇన్‌షాప్ పద్ధతిలో మెడికల్ కౌంటర్లను ఏర్పాటు చేసింది. మందుల కొనుగోలుపై ఏకంగా 20% డిస్కౌంట్ ఆఫర్ చేస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటోంది. డీమార్ట్ తీసుకున్న ఈ నిర్ణయం ఫార్మా రిటైల్ మార్కెట్‌లో పెద్ద కలకలమే రేపుతోంది.సాధారణంగా ఎంఆర్‌పీ ధరలకే మందులు విక్రయించే స్థానిక మెడికల్ షాపులకు డీమార్ట్ 20% డిస్కౌంట్ మోడల్ పెద్ద సవాలుగా మారనుంది.ఇప్పటికే భారీ ఆర్థిక నష్టాల్లో ఉంటూ లాభాల బాట పట్టేందుకు తంటాలు పడుతున్న ఆన్‌లైన్ మెడికల్ యాప్‌లకు ఇది కోలుకోలేని దెబ్బ కావచ్చు. డీమార్ట్ ఈ నిర్ణయం వెనుక బలమైన బిజినెస్ క్యాలిక్యులేషన్ ఉంది. సంప్రదాయ కిరాణా వ్యాపారంలో ప్రాఫిట్ మార్జిన్లు కేవలం 7% నుండి 8% మాత్రమే ఉంటాయి. కానీ బ్రాండెడ్ జెనెరిక్స్ ఉన్న ఫార్మా రంగంలో ఏకంగా 25% నుండి 30% వరకు మార్జిన్లు లభిస్తాయి. డీమార్ట్‌కు ఇప్పటికే దేశవ్యాప్తంగా 503 హైపర్‌మార్కెట్ల భారీ నెట్‌వర్క్ ఉంది.కొత్తగా మెడికల్ షాపుల కోసం అద్దెలు చెల్లించాల్సిన పనిలేదు. అలాగే రోజూ వేల సంఖ్యలో వచ్చే కస్టమర్లే ఈ కౌంటర్లకు ప్రధాన బలం. కస్టమర్లను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా యాడ్స్ ఇవ్వాల్సిన అవసరం కూడా లేకపోవడంతో, 20% డిస్కౌంట్ ఇచ్చినా డీమార్ట్ సులువుగా లాభాలు గడించగలదని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. సూపర్ మార్కెట్ రంగంలో చిన్న వ్యాపారులకు గట్టి పోటీ ఇచ్చిన డీమార్ట్, ఇప్పుడు మెడికల్ రంగంలో కూడా తన ముద్ర వేయబోతోంది. ఈ పవర్ ప్లే రాబోయే రోజుల్లో భారత ఫార్మా రిటైల్ స్వరూపాన్నే మార్చివేసేలా కనిపిస్తోంది.

# రెండో రోజూ లాభాల్లో ముగిసిన సూచీలు

**బిజినెస్ డెస్క్ :**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి .అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా స్టాక్స్‌లో కొనుగోళ్లు కలిసొచ్చాయి. అమెరికా వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నప్పటికీ.. భవిష్యత్‌లో రేట్ల పెంపు ఉంటుందన్న సంకేతాలతో మదుపర్లు అప్రమత్తత పాటించడం కనిపించింది. ఈ క్రమంలోనే వరుసగా రెండో రోజూ సూచీలు లాభపడ్డాయి. సెన్సెక్స్ 273.55 పాయింట్లు లాభంతో 77,928.15 వద్ద ముగిసింది. నిఫ్టీ 66.95 పాయింట్లు పెరిగి 24,317.15 వద్ద స్థిరపడింది. రూపాయితో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.67 వద్ద ఉంది.సెన్సెక్స్ 30లో మారుతీ, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, పవర్‌గ్రిడ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఆదానీ పోర్ట్స్, ఇండిగో, బజాజ్ బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 91.09 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,068.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# పిల్లల చదువుకు రూ.16 లక్షలు.. ఇలా పొదుపు చేయండి




**బిజినెస్ డెస్క్ :**

పిల్లల ఉన్నత చదువులు, భవిష్యత్తు అవసరాల కోసం ఇప్పటి నుంచే పొదుపు చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తుంటారు. ఇలాంటి వారికి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ మంచి ఆప్షన్‌గా చెప్పొచ్చు. పిల్లల పేరుతో నెలకు కేవలం రూ.5,000 చొప్పున పెట్టుబడి పెడితే భారీ మొత్తంలో ఫండ్ తయారవుతుంది.

**నెలకు రూ.5,000 పెడితే ఎంత మొత్తం వస్తుంది?**

మీరు ప్రతి నెలా రూ.5,000 చొప్పున పిపిఎఫ్ ఖాతాలో జమ చేస్తే, ఏడాదికి మొత్తం రూ.60,000 అవుతుంది. ఇలా 15 సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా డబ్బు జమ చేస్తే, మీ మొత్తం పెట్టుబడి రూ.9 లక్షలు అవుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం పిపిఎఫ్ పై 7.1 శాతం వార్షిక వడ్డీ అందిస్తోంది. ఇదే వడ్డీ రేటు కొనసాగితే.. మొత్తం పెట్టుబడి రూ.9,00,000 అయితే వడ్డీ ద్వారా వచ్చే మొత్తం సుమారు రూ.7,27,284 అవుతుంది.మెచ్యూరిటీ సమయానికి సుమారు రూ. 16,27,284 అవుతుంది. అయితే ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి పిపిఎఫ్ వడ్డీ రేటును సమీక్షిస్తుంది. అందువల్ల చివరికి వచ్చే మొత్తంలో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది.

**పిల్లల పేరుతో పిపిఎఫ్ ఖాతా ఎలా తెరవాలి?**

తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లల పేరుతో పిపిఎఫ్ ఖాతాను సులభంగా ప్రారంభించవచ్చు. అయితే ఒక ముఖ్యమైన నిబంధన గుర్తుంచుకోవాలి. ఒక ఆర్థిక సంవత్సరంలో తల్లిదండ్రుల పిపిఎఫ్ ఖాతా, పిల్లల PPF ఖాతా రెండింటిని కలిపి గరిష్ఠంగా రూ.1.5 లక్షలు మాత్రమే జమ చేయాలి. అంటే మీరు ఇప్పటికే మీ పిపిఎఫ్ ఖాతాలో ఏడాదికి రూ.1.5 లక్షలు జమ చేస్తుంటే, అదే సంవత్సరంలో పిల్లల ఖాతాలో అదనంగా డబ్బు జమ చేసే అవకాశం ఉండదు. కాబట్టి పెట్టుబడి పెట్టే ముందు ఈ పరిమితిని గుర్తుంచుకోవాలి.

**పిపిఎఫ్ లో ట్యాక్స్ ప్రయోజనాలు ఏంటి?**

పిపిఎఫ్ లో పెట్టుబడి పెట్టడం వల్ల పన్ను పరంగా కూడా మంచి ప్రయోజనాలు ఉంటాయి. పెట్టుబడిపై ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80C కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. ప్రతి ఏడాది వచ్చే వడ్డీపై కూడా పన్ను ఉండదు. 15 సంవత్సరాల తర్వాత మెచ్యూరిటీ సమయంలో అందే మొత్తం కూడా పూర్తిగా ట్యాక్స్ ఫ్రీ. అంటే పెట్టుబడి, వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం మూడు దశల్లోనూ పన్ను మినహాయింపు లభించడం పిపిఎఫ్ ప్రత్యేకత.

**కాంపౌండింగ్‌తో భారీ ఫండ్.. ఎవరికి సరైన ఎంపిక?**

పిపిఎఫ్ లో కాంపౌండ్ ఇంటరెస్ట్ (చక్రవడ్డీ) ప్రయోజనం ఉంటుంది. అంటే ప్రతి సంవత్సరం వచ్చిన వడ్డీ కూడా అసలు మొత్తంలో కలుస్తుంది. దానిపై కూడా మళ్లీ వడ్డీ వస్తుంది. దీంతో కాలక్రమేణా మీ పెట్టుబడి వేగంగా పెరుగుతుంది. 15 సంవత్సరాల తర్వాత వెంటనే డబ్బు అవసరం లేకపోతే, ఖాతాను మరో 5 సంవత్సరాల చొప్పున పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. దీంతో పిల్లలు కాలేజీ చదువులు ప్రారంభించే సమయానికి మరింత పెద్ద మొత్తాన్ని సమకూర్చుకోవచ్చు. అయితే తక్కువ కాలానికి, అంటే 2 నుంచి 4 సంవత్సరాల్లో డబ్బు అవసరమయ్యే లక్ష్యం ఉంటే పిపిఎఫ్ సరైన ఎంపిక కాదు. ఎందుకంటే ఇందులో మధ్యలో డబ్బు ఉపసంహరించుకోవడానికి కొన్ని నిబంధనలు ఉంటాయి. కానీ పిల్లల ఉన్నత విద్య, భవిష్యత్ అవసరాల కోసం దీర్ఘకాలికంగా, ఎలాంటి రిస్క్ లేకుండా పొదుపు చేయాలనుకునే వారికి పిపిఎఫ్ అత్యంత నమ్మకమైన ప్రభుత్వ పథకాలలో ఒకటి.

# బీఎస్-3 వాహనాల్లో కొన్ని రబ్బరు భాగాలు మార్చాల్సి రావచ్చు: గడ్కరీ





**న్యూఢిల్లీ, జూలై30 :**

దేశంలో 2016 ముందు తయారైన బీఎస్ 3 వాహనాలను ఇ20 ఇంధనంతో (20% ఇథనాల్ కలిపిన పెట్రోలు) నడిపినప్పుడు, వాటిలోని కొన్ని రబ్బరు భాగాలు, గాస్కెట్లు దెబ్బతినే అవకాశం ఉందని ప్రభుత్వం బుధవారం తెలిపింది. ఇ20 వాడటం వల్ల మైలేజీ తగ్గుతుందన్న ఆందోళనలపై రాజ్యసభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కేవలం ఇంధనమే కాకుండా పలు ఇతర అంశాలు కూడా వాహన మైలేజీని ప్రభావం చేస్తాయని వాహన తయారీ సంస్థలు, వాహన/ ఇంజిన్ పరీక్షా సంస్థలు స్పష్టం చేసినట్లు మంత్రి తెలిపారు. ద్విచక్ర వాహనాలు, కార్లపై ఇ20 ఇంధన ప్రభావాన్ని అంచనా వేయడానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (ఐఐపీ) డెహ్రాడూన్, సియామ్, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఓ అధ్యయనం నిర్వహించాయని చెప్పారు.ఇ20 ఇంధనం వాడేందుకు, ఈ వాహనాల ఇంజిన్లలో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదని ఆ అధ్యయనం తేల్చిందని స్పష్టం చేశారు. పాత వాహనాల్లో డ్రైవబిలిటీ, స్టార్టబిలిటీ, మెటల్ కంపాటబిలిటీ, ప్లాస్టిక్ కంపాటబిలిటీ లాంటి ప్రమాణాల్లోనూ సమస్యలు లేవని తేలిందని మంత్రి పేర్కొన్నారు. బీఎస్3 వాహనాలపై జరిపిన పరీక్షల్లోనే కొన్ని రబ్బరు భాగాలు, గాస్కెట్లను మార్చాల్సిన అవసరం పడొచ్చని వెల్లడైందని తెలిపారు. వీటిని సాధారణ సర్వీసింగ్ సమయంలోనూ సులభంగా మార్చుకోవచ్చని వివరించారు.

**హైడ్రోజన్ ఆధారిత వాహనాల కోసం 12 ప్రాజెక్టులు:**

జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ (ఎన్‌జీహెచ్‌ఎం) కింద 70 హైడ్రోజన్ ఆధారిత వాహనాలను ప్రవేశపెట్టేందుకు మొత్తం 13 పైలట్ ప్రాజెక్టులను మంజూరు చేసినట్లు లోక్‌సభకు కొత్త, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్ తెలిపారు. ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వాహనాలు (ఎఫ్‌సీఈవీలు), హైడ్రోజన్ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ (హెచ్ఐసీఈ) వాహనాలతో కూడిన 27 బస్సులు, 43 ట్రక్కులతో పాటు వివిధ రాష్ట్రాల్లోని 21 మార్గాల్లో 16 హైడ్రోజన్ రీఫ్యూయలింగ్ స్టేషన్ల ఏర్పాటు కూడా ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఉన్నాయని వివరించారు. ఈ ప్రాజెక్టులకు కేటాయించిన మొత్తం ఆర్థిక సాయం రూ.410.77 కోట్లు కాగా.. ఇందులో రూ.41.582 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించారు. ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్+ ఐఓసీఎల్, ఆర్ఐఎల్+ఏఎల్, హెచ్‌పీసీఎల్+ వోల్వో, ఎన్‌టీపీసీ జీఈఎల్ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఈ పైలట్ ప్రాజెక్టులను చేపట్టనున్నాయని వివరించారు.

# ఏషియన్ లెజెండ్స్ టీ20 లీగ్ షురూ







## శ్రీలంక లయన్స్‌కు తొలి విజయం..
## ఆగస్టు 2న భారత్-పాకిస్థాన్ హై ఓల్టేజ్ పోరు

**లుసాకా (జాంబియా), జూలై 30:** గేషియన్ లెజెండ్స్ లీగ్ రెండవ సీజన్ అధికారికంగా ప్రారంభమైంది. మొదటి సీజన్ సాధించిన ఘన విజయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఈ లీగ్ మరింత భారీ స్థాయిలో అలరించేందుకు సిద్ధమైంది. మొదట ఈ టోర్నమెంట్ కేన్యాలోని నైరోబీలో జరగాల్సి ఉన్నప్పటికీ, షెడ్యూల్ మార్పుల కారణంగా జూలై-ఆగస్టు నెలల్లో జాంబియాలోని లోటస్ స్పోర్ట్స్ క్లబ్ గ్రౌండ్‌లో నిర్వహించబడుతోంది. మొత్తం 19 టీ20 మ్యాచ్‌లు జరగనున్న ఈ టోర్నీలో తొలి పోరు శ్రీలంక లయన్స్, ఆఫ్ఘనిస్తాన్ పఠాన్స్ జట్ల మధ్య జరిగింది. దీనిలో శ్రీలంక విజయం సాధించింది. విశ్రాంత ఆటగాళ్ల ఆసియా కప్‌గా ప్రసిద్ధి చెందిన ఈ లీగ్‌లో కేవలం ఆసియా దేశాల మాజీ అంతర్జాతీయ క్రికెటర్లు మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సీజన్‌లో ఇండియన్ రాయల్స్, పాకిస్తాన్ పాంథర్స్, శ్రీలంకన్ లయన్స్, ఆఫ్ఘనిస్తాన్ పఠాన్స్, బంగ్లాదేశ్ టైగర్స్ మరియు రెస్ట్ ఆఫ్ ఆసియన్ స్టార్స్ అనే ఆరు ఫ్రాంచైజీ జట్లు తలపడుతున్నాయి. ఈ టోర్నమెంట్‌లో అత్యంత ఆసక్తికరమైన, హై-వోల్టేజ్ మ్యాచ్ ఆగస్టు 2న ఇండియన్ రాయల్స్ మరియు పాకిస్తాన్ పాంథర్స్ మధ్య జరగనుంది. ఈ ప్రత్యర్థుల పోరు కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇండియన్ రాయల్స్ తరఫున శిఖర్ ధావన్, సురేష్ రైనా, దినేష్ కార్తీక్, హర్భజన్ సింగ్, యూసుఫ్ పఠాన్, అంబటి రాయుడు, రిషి ధావన్, స్టువర్ట్ బిన్నీ వంటి దిగ్గజాలు మైదానంలోకి దిగుతున్నారు. అలాగే పాకిస్తాన్ పాంథర్స్ జట్టులో మహమ్మద్ హఫీజ్, షోయబ్ మాలిక్, వహాబ్ రియాజ్, సయీద్ అజ్మల్, కమ్రాన్ అక్మల్, సోహైల్ తన్వీర్ వంటి ఆటగాళ్లు ఉన్నారు. వీరితో పాటు తిసారా పెరీరా, తిలకరత్నే దిల్షాన్, షకీబ్ అల్ హసన్, అస్గర్ అఫ్గాన్ లాంటి ఆసియా క్రికెట్ దిగ్గజాలు కూడా ఈ లీగ్‌లో పాల్గొంటున్నారు. ఈ మ్యాచ్‌లు ప్రపంచవ్యాప్తంగా లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రసారం కానున్నాయి.

# భారత హాకీ జట్టుకు కొత్త లుక్

## బ్లూ జెర్సీకి గుడ్‌బై..

## ప్రపంచకప్‌లో కాషాయ జెర్సీతో బరిలోకి భారత్




**న్యూఢిల్లీ, జూలై 30: భారత** హాకీ జట్లు ఎన్నో గేళ్లుగా ధరిస్తున్న సంప్రదాయ బ్లూ జెర్సీకి వీడ్కోలు పలికాయి. రానున్న ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు తొలిసారిగా కాషాయ రంగు జెర్సీతో బరిలోకి దిగనున్నాయి. నెదర్లాండ్స్, బెల్జియంలో ఆగస్టు 15 నుంచి 30 వరకు జరిగే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని హాకీ ఇండియా కొత్త జెర్సీలను ఆవిష్కరించింది. కొత్త జెర్సీ రంగు ఎంపికపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది. భారత మాజీ కెప్టెన్ వీరెన్ రస్కిన్హా స్పందిస్తూ.. తన కెరీర్ మొత్తం బ్లూ జెర్సీని గర్వంగా ధరించానని, అదే భారత జట్టుకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిందని పేర్కొన్నారు. దీంతో జెర్సీ మార్పుపై చర్చ మరింత ఊపందుకుంది. ఈ విమర్శలకు స్పందించిన హాకీ ఇండియా.. ఈ నిర్ణయం పూర్తిగా సాంకేతిక కారణాలతో తీసుకున్నదేనని స్పష్టం చేసింది. ప్రస్తుతం అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు ఎక్కువగా నీలం రంగు సింథటిక్ టర్ఫ్‌పై జరుగుతున్నందున, బ్లూ జెర్సీతో ఆటగాళ్లను గుర్తించడం కష్టంగా మారుతోందని తెలిపింది. కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్, ఆటగాళ్లతో విస్తృతంగా చర్చించిన తర్వాతే కొత్త రంగును ఎంపిక చేసినట్లు వెల్లడించింది. మొదట ప్రత్యామ్నాయంగా పసుపు, కాషాయ రంగులను పరిశీలించిన హాకీ ఇండియా.. చివరకు భారత జాతీయ పతాకంలోని ప్రధాన రంగైన కాషాయాన్ని ఖరారు చేసింది. ధైర్యం, త్యాగం, విజయానికి ప్రతీకగా నిలిచే కాషాయ రంగు సాంకేతిక అవసరాలతో పాటు జాతీయ గౌరవాన్ని కూడా ప్రతిబింబిస్తుందని పేర్కొంది. కొత్త జెర్సీలో భారతీ-య సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్‌లను రూపొందించారు. అశోక చక్రం స్ఫూర్తితో నేవీ బ్లూ ఆకృతులు, ఛాతీపై సుదర్శన చక్రం ఆధునిక రూపకల్పన, భుజాలు, పక్క భాగాల్లో త్రివర్ణ పతాక రంగుల స్ట్రిప్స్‌ను జోడించారు. ముందు భాగంలో 'ఇండియా' అనే పదాన్ని ప్రత్యేక దేవనాగరి శైలిలో ముద్రించి భారత సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించారు. కాషాయ జెర్సీతో పాటు ఇదే నమూనాలో తెలుపు రంగు జెర్సీని కూడా విడుదల చేశారు. ప్రత్యర్థి జట్టు జెర్సీలను బట్టి అవసరమైనప్పుడు ఈ జెర్సీని ఉపయోగించనున్నారు. అయితే సంప్రదాయ బ్లూ జెర్సీకి వీడ్కోలు పలకడంపై అభిమానుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# గిల్ 'మాస్టంప్లాన్'కు బీసీసీఐ గ్రీన్ సిగ్నల్




## శ్రీలంక టెస్టు సిరీస్‌కు ముందే 15 రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరం

**న్యూఢిల్లీ, జూలై 30:** భారత క్రికెట్ జట్టు టెస్టు సిరీస్‌లకు సిద్ధమయ్యే విధానంలో ఒక ముఖ్యమైన మార్పు కనిపిస్తోంది. ప్రతి టెస్టు సిరీస్‌కు ముందు ఆటగాళ్లు రెడ్ బాల్ క్రికెట్‌కు సరైన రీతిలో సమాయత్తమయ్యేందుకు 15 రోజుల శిక్షణా క్యాంప్‌ను నిర్వహించాలని కెప్టెన్ శుభమన్ గిల్ భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)కి సూచించారు. గతంలో న్యూజిలాండ్, సౌతాఫ్రికాలతో జరిగిన టెస్టు సిరీస్‌లలో భారత్ ఓటమి పాలైన నేపథ్యంలో, గిల్ ఇచ్చిన ఈ విలువైన సూచనను బిసిసిఐ సానుకూలంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు సంబంధించి, సిరీస్ ప్రారంభానికి 18 రోజుల ముందే (జూలై 18న) బిసిసిఐ భారత జట్టును ప్రకటించడం ఈ మార్పునకు నిదర్శనం. అంతేకాకుండా, సిరీస్ ఆరంభానికి ముందే ఆగస్టు 7 నుంచి భారత జట్టు నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో కూడా పాల్గొననుంది. ఈ ఆసక్తికర పరిణామంపై భారత జట్టు మాజీ బ్యాటర్ హనుమ విహారి తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పందిస్తూ, సాధారణంగా టెస్టు సిరీస్‌లు ఐపిఎల్ లేదా ఇతర పరిమిత ఓవర్ల సిరీస్‌లు ముగిసిన వెంటనే జరుగుతుంటాయని, కానీ ఈసారి జట్టును ఇంత త్వరగా ప్రకటించడం అరుదైన విషయమని తెలిపారు. గిల్ సూచనల మేరకే బిసిసిఐ ఈ నిర్ణయం తీసుకుందని, ఇది జట్టు సన్నాహకానికి ఎంతో తోడ్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసిసి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించే క్రమంలో భారత్‌కు ఈ సిరీస్ అత్యంత కీలకమైనదని, ఇక్కడి రెండు మ్యాచ్‌లలోనూ విజయం సాధిస్తే విన్ పర్సంటేజ్ గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లతో పాటు శ్రీలంక పర్యటన భారత్ ఫైనల్ అవకాశాలను నిర్దేశిస్తుందన్నారు. శ్రీలంకలో పిచ్‌లు మందకొడిగా ఉంటూ, స్పిన్‌కు అనుకూలిస్తాయి కాబట్టి స్వదేశంలో ఆ జట్టును ఎదుర్కోవడం సవాలుతో కూడుకున్నదని విహారి హెచ్చరించారు. భారత బ్యాటర్లు సాధారణంగా స్వీప్ షాట్లు తక్కువగా ఆడుతారని, శ్రీలంక స్పిన్నర్లను ఎదుర్కోవడానికి వారు స్వీప్ షాట్లపై దృష్టి సారించి తగినంత ప్రాక్టీస్ చేయాలని సూచించారు. ఈ సిరీస్ కోసం శుభమన్ గిల్ నాయకత్వంలోని భారత జట్టులో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్, సారాంశ్ జైన్ వంటి కీలక ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు.



# ఫైనల్‌కు భారత టీటీ జట్లు

**ఢిల్లీ:** కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్‌కు దూసుకెళ్లాయి. ఢిల్లీలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన సెమీఫైనల్స్‌లో భార త్.. ఇంగ్లండ్‌ను చిత్తుచేసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. మహిళల జట్టు.. 3-1తో, పురుషుల జట్టు 3-0తో ఇంగ్లండ్‌ను ఇంటికి పంపించింది. మహిళల విభాగంలో హైదరాబాదీ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ ఆడిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ గెలిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ఫైనల్స్‌లో భారత జట్లు.. మలేషియాతో అమీతుమీ తేల్చుకోనున్నాయి.




# చలి దెబ్బకు పరుల్‌కు పతకం దూరం

## కామన్వెల్త్‌లో మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో ఐదో స్థానం..

## ఆసియా క్రీడల్లో పతకమే లక్ష్యమన్న భారత అథ్లెట్

**గ్లాస్గో, జూలై 30:** కామన్వెల్త్ క్రీడల్లో భారత స్టార్ అథ్లెట్ పరుల్ చౌదరీకు నిరాశ ఎదురైంది. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పతక ఆశలతో బరిలోకి దిగిన పరుల్ అనూహ్యంగా ఐదో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 9 నిమిషాల 26.75 సెకన్లలో రేసును పూర్తి చేసిన ఆమె తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పతకం సాధించాలన్న కలను నెరవేర్చుకోలేకపోయింది. పోటీ అనంతరం మాట్లాడిన పరుల్.. గ్లాస్గోలో నెలకొన్న తీవ్ర చలి తన ప్రదర్శనపై ప్రభావం చూపిందని తెలిపింది. చలి కారణంగా కాళ్ల వేళ్లు బిగుసుకుపోవడంతో ఆశించిన స్థాయిలో పరుగెత్తలేకపోయానని వెల్లడించింది. సన్నద్ధత బాగానే ఉన్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితులు తన అవకాశాలను దెబ్బతీశాయని పేర్కొంది. ఈ ఫలితంతో కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెటిక్స్ జట్టుకు ఎదురైన మరో నిరాశగా నిలిచింది. అయితే ఈ వైఫల్యాన్ని పాఠంగా తీసుకుని రాబోయే ఆసియా క్రీడల్లో పతకం సాధించడమే తన తదుపరి లక్ష్యమని పరుల్ చౌదరీ స్పష్టం చేసింది.




# నీరజ్ చోప్రాకు 5వ స్థానం

## జావెలిన్ ఫైనల్లో ముగ్గురు భారతీయులు..!

**గ్లాస్గో, జూలై 30:** ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా అంచనాలు అందుకుంటూ కామన్వెల్త్ గేమ్స్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో గురువారం జరిగిన జావెలిన్ అర్హత రౌండ్‌లో సత్తా చాటిన చోప్రా ఐదో స్థానంలో నిలలిచాడు. అతడితో పాటు ఆకట్టుకున్న మరో ఇద్దరు భారత అథ్లెట్లు యశ్ వీర్ సింగ్, రోహిత్ యాదవ్‌లు సైతం ఫైనల్లో అడుగుపెట్టారు. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ శ్రీలంకకు చెందిన రుమేశ్ పథిరగ ఈటెను 82.84 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానం సాధించాడు. కామన్వెల్త్ క్రీడల్లో జావెలిన్ త్రో పోటీ ఆసక్తి రేపుతోంది. గురువారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ముగ్గురు భాతర అథ్లెట్లు ఫైనల్ చేరారు. రెండుసార్లు ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రాతో పాటు యశ్ వీర్ సింగ్, రోహిత్ యాదవ్‌లు పతక వేటకు అర్హత సాధించారు. చోప్రా 79.61 మీటర్ల దూరం ఈటెను విసరగా.. 78.37 మీటర్లకు పరిమితమైన రోహిత్ 9వ స్థానంతో, యశ్ (78.36 మీటర్లు) పదో ప్లేస్‌తో ఫైనల్ చేరారు. పారిస్ ఒలింపిక్స్‌లో 90 మీటర్ల మార్క్ అందుకొని స్వర్ణం ఎగరేసుకుపోయిన అర్షద్ నదీమ్(పాకిస్థాన్) సైతం 73.63 మీటర్లతో క్వాలిఫై అయ్యాడు. అయితే.. నేరుగా అర్హతకు నిర్దేశించిన 84 మీటర్ల దూరం గీ ఒక్కరూ అందుకోలేదు. ఆగస్టు1వ తేదీ, శనివారం ఫైనల్ జరుగనుంది.

# దృశ్యకావ్యంలా 'రామాయణ' ట్రైలర్








### హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో నితీశ్ తివారీ మాయాజాలం..

## రణ్‌బీర్, యశ్ పాత్రలు హైలైట్

ముంబై, జూలై 30: భారతీయ ఇతిహాసాల్లో చిరస్థాయిగా నిలిచిన రామాయణం మరోసారి వెండితెరపై అద్భుత దృశ్యకావ్యంగా ఆవిష్కృతం కానుంది. దర్శకుడు నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ' ట్రైలర్ విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అత్యున్నత నిర్మాణ విలువలు, హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్, అద్భుత గ్రాఫిక్స్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను మరింత పెంచింది. ట్రైలర్ ప్రారంభంలో 'దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అనే డైలాగ్‌తో రావణుడి పాత్రలో యశ్‌ను పరిచయం చేశారు. అనంతరం 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ శ్రీమహావిష్ణువు అవతరిస్తాడు' అనే నేపథ్యంతో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్‌ను చూపించిన తీరు ఆకట్టుకుంటోంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీతారాముల కల్యాణం, వనవాసం, రావణుడితో యుద్ధం వంటి కీలక ఘట్టాలను విజువల్ వైభవంతో ఆవిష్కరించారు. సాధారణంగా మృదుస్వభావిగా కనిపించే సీతాదేవిని ఈ చిత్రంలో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. పుష్పక విమానాన్ని భారీ తామరపువ్వు ఆకారంలో డిజైన్ చేయగా, జటాయువు, ఐరావతం వంటి పాత్రలను అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో తీర్చిదిద్దారు. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవీ దూబే, భరతుడిగా ఆదినాథ్ కొఠారే, కైకేయిగా లారా దత్త, మంథర పాత్రలో శీబా చద్దా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. శూర్పణఖ పాత్రలో రకుల్ ప్రీత్ సింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, వివేక్ ఒబెరాయ్ విద్యుజ్జిహ్వ పాత్రలో కనిపించారు. పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కనిపించడం ప్రేక్షకులకు సర్‌ప్రైజ్‌గా మారింది. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్, ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు మరింత బలం చేకూర్చింది. విజువల్స్‌కు తగ్గట్టుగా సంగీతం ప్రతి సన్నివేశాన్ని మరింత భావోద్వేగంగా మలిచింది. దాదాపు రూ. 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం ఈ గీడాది దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. రామానంద్ సాగర్ రూపొందించిన రామాయణం ధారావాహికలో రాముడిగా నటించిన అరుణ్ గోవిల్ ఈ చిత్రంలో దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. ట్రైలర్ విడుదలతో భారతీయ సినీ ప్రేక్షకుల్లో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి.



## 'శ్రీనివాస మంగాపురం'తో ఆకట్టుకున్న జయకృష్ణ-రాషా తడాని

### లవ్, యాక్షన్, ఎమోషన్స్‌తో అలరించిన అజయ్ భూపతి చిత్రం

**హైదరాబాద్, జూలై 30:** ఘట్టమనేని కుటుంబం నుంచి హీరోగా పరిచయమైన జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కుమార్తె రాషా తడాని జంటగా నటించిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆర్ఎక్స్ 100, మంగళవారం చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేమ, యాక్షన్, కుటుంబ భావోద్వేగాల మేళవింపుగా రూపొందింది. తిరుపతి నేపథ్యంలో సాగే ఈ కథలో నగరానికి వచ్చిన శ్రీను (జయకృష్ణ) ప్రభావశీలి పెద్దిరెడ్డి (శ్యామ్) కుమార్తె మంగ (రాషా తడాని)ని ప్రేమిస్తాడు. ఆమె జీవితానికి సంబంధించిన ఓ రహస్యం వెలుగులోకి రావడంతో కథ ఆసక్తికర మలుపులు తిరుగుతుంది. శ్రీను గతం, మంగతో ఉన్న అనుబంధం, వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి మధ్య జరిగిన సంఘటనలు చివరికి కథను భావోద్వేగభరిత క్లైమాక్స్‌కు తీసుకెళ్తాయి. సినిమా తొలి భాగం ప్రేమకథ, పాటలు, కామెడీతో సాగగా.. ద్వితీయార్థంలో ఫ్లాష్‌బ్యాక్, యాక్షన్, ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. దర్శకుడు అజయ్ భూపతి ఈసారి ప్రయోగాల కంటే కమర్షియల్ అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. కథలో కొత్తదనం తక్కువగా ఉన్నప్పటికీ, భావోద్వేగాలు, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు బలం చేకూర్చాయి. హీరో జయకృష్ణ తొలి చిత్రంలోనే మంచి నటన కనబరిచారు. ముఖ్యంగా భావోద్వేగ, యాక్షన్ సన్నివేశాల్లో ఆకట్టుకున్నారు. రాషా తడాని తన అందం, అభినయంతో ప్రేక్షకులను మెప్పించారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోహన్ బాబు తన అనుభవంతో పాత్రకు బలం చేకూర్చగా, శ్యామ్ ప్రతినాయకుడిగా ఆకట్టుకున్నారు. బ్రహ్మాజీ, నరేష్‌ల హాస్య సన్నివేశాలు వినోదాన్ని పంచాయి. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచాయి. నిర్మాణ విలువలు, ఛాయాగ్రహణం కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తంగా 'శ్రీనివాస మంగాపురం' ప్రేమ, యాక్షన్, భావోద్వేగాలతో కూడిన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరిస్తోంది. కొత్త జంట జయకృష్ణ--రాషా తడాని నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది.



## ఆస్ట్రేలియా వెకేషన్‌లో త్రిష..

### ఒక్క క్యాప్షన్‌తో మొదలైన చర్చ

స్టార్ హీరోయిన్ త్రిష తాజాగా చేసిన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ధనుష్‌తో మ-రోసారి వెంకీ అట్లూరి.. ధనుష్ 'సార్' సినిమాతో తెలుగు, తమిళ ప్రేక్షకులను ఒకేసారి ఆకట్టుకున్న దర్శకుడు వెంకీ అట్లూరి. తమిళ స్టార్ ధనుష్‌తో మరోసారి జతకట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని వెంకీ అట్లూరి తాజాగా ఓ ఇంటర్వ్యూలో అధికారికంగా వెల్లడించారు. ఇప్పటికే ధనుష్‌కు కొత్త కథకు సంబంధించిన స్టోరీ లైన్ వినిపించానని, ఆయన నుంచి సానుకూల స్పందన లభించిందని వెంకీ తెలిపారు. ప్రస్తుతం తాను తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా విడుదలైన తర్వాత ఈ కథపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి ప్రీ-ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తానని చెప్పారు. ఈసారి ధనుష్‌ను పూర్తిగా భిన్నమైన అవతారంలో చూపించబోతున్నట్లు వెంకీ అట్లూరి వెల్లడించారు. 'పోలీస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమా రూపొందనుంది. కథలో బలమైన భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలకు కూడా పెద్దపీట వేయనున్నాం' అని చెప్పారు. గతంలో వెంకీ అట్లూరి దర్శకత్వంలో ధనుష్ నటించిన 'సార్' (వాతి) చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి విజయాన్ని సాధించింది. ముఖ్యంగా విద్యా వ్యవస్థ నేపథ్యంలో రూపొందిన ఆ చిత్రం ఇద్దరికీ మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు అదే విజయవంతమైన కాంబినేషన్ మరోసారి రిపీట్ కానుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నటీనటులు, నిర్మాత, షూటింగ్ షెడ్యూల్ వంటి పూర్తి వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉ ంది. ప్రస్తుతం వెంకీ అట్లూరి 'విశ్వనాథ్ అండ్ సన్స్' పనులతో బిజీగా ఉండగా, ధనుష్ కూడా వరుస చిత్రాలతో తీరిక లేకుండా ఉన్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రానున్న

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com